నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 17-7-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 286 | పేజీలు: 4 | వెల: రూ.1/-

జీవించే హక్కు కంటే మత విశ్వాసాలేమీ ముఖ్యం కాదు: సుప్రీం..

హైదరాబాద్ , జులై 16:కరోనా మహమ్మారి సమయంలో జరుగుతున్న కన్వర్ యాత్రను రద్దు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. మామూలుగా అయితే హరిద్వార్ నుంచి గంగాజలాన్ని తీసుకువస్తారు కాని ఈ సారి అనుమతించవద్దని రాష్ట్రాలకు సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. కరోనా థర్డ్ వేవ్ ఆందోళనల నేపథ్యంలో కన్వర్ యాత్రను ఉత్తరాఖండ్ ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. ఇక హరిద్వార్ నుంచి గంగాజలాన్ని తీసుకురావడాన్ని మిగిలిన రాష్ట్రాలకు అనుమతించొద్దని ఆదేశాల్లో పేర్కొంది. నిర్దేశిత ప్రాంతాల్లో శివాభిషేకాలకు గంగాజలాన్ని ట్యాంకర్ల ద్వారా ఏర్పాటు చేయాలని సూచించింది. జీవించే హక్కు కంటే మత విశ్వాసాలేమీ ముఖ్యం కాదని కీలక వ్యాఖ్యలు చేసింది.

హరిద్వార్ నుంచి గంగాజలం తీసుకురావడానికి కన్వరియాలకు అనుమతి ఇవ్వొద్దని రాష్ట్రాలకు సూచించినట్టు కేంద్రం తెలిపింది తన అఫిడవిట్ లో పేర్కొంది. అయితే మతవిశ్వాసాలను అనుసరించి ట్యాంకర్ల ద్వారా గంగాజలం అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేయాలని సూచించినట్టు పేర్కొంది. సం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులకు అందుబాటులో ఉండేలా చూస్తున్నామని సుప్రీం కోర్టుకు తెలిపింది. ఆ నీటినే సమీపంలో శివాలయాల్లో అభిషేకానికి వినియోగించుకోవలసిందిగా సూచించామని తెలిపింది. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ గంగాజలం పంపిణీ చేసుకోవలసిందిగా భక్తులకు సూచించినట్టు సుప్రీం కోర్టుకు తెలిపింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

ఆరు రాష్ట్రాల సీఎంలతో ప్రధాని మోదీ సమావేశం



న్యూఢిల్లీ, జులై 16: కరోనా కేసులు అధికంగా వెలుగుచూస్తున్న తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, ఒడిషా, కేరళ రాష్ట్రాల సీఎంలతో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. మొత్తం కేసుల్లో 80 శాతం ఈ రాష్ట్రాల నుంచే వెలుగుచూస్తుండటంతో ఆయా రాష్ట్రాల్లో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

థర్డ్ వేవ్ ముంచుకొస్తుందనే ఆందోళనల నేపథ్యంలో ప్రజలు కరోనా నిబంధనలను విధిగా పాటించాలని కోరారు. కేసుల సంఖ్య తగ్గుతున్నదనే అలసత్వం పనికిరాదని సూచించారు. మనం థర్డ్ వేవ్ దేశాన్ని తాకుతుందనే అంచనాల నడుమ ఉన్నామని, 80 శాతం కేసులు ఈ రాష్ట్రాల్లోనే నమోదవుతున్న క్రమంలో సెకండ్‌వేవ్ ఆరంభంలో ఉన్న పరిస్థితి ప్రస్తుతం నెలకొందని పేర్కొన్నారు. థర్డ్ వేవ్ ముంచెత్తనుందనే అంచనాల నడుమ కేసుల భారం అధికంగా ఉన్న రాష్ట్రాలు వైరస్ వ్యాప్తి కట్టడికి కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

పరీక్షలు నిర్వహించడం, కాంటాక్టు ట్రేసింగ్, చికిత్స, వ్యాక్సినేషన్‌లపై దృష్టిసారించాలని అన్నారు. కేంద్రం ఇటీవల ప్రకటించని కొవిడ్ అత్యవసర ప్యాకేజ్ నిధులను ఉపయోగించుకుని రాష్ట్రాలు తమ ఆరోగ్య మౌలిక వసతులను మెరుగుపరుచుకోవాలని ప్రధాని సూచించారు. ఇక శుక్రవారం దేశవ్యాప్తంగా 38,949 కేసులు నమోదవగా మరణాలు 100 రోజుల కనిష్టస్థాయిలో 542గా నమోదయ్యాయి

అత్యుత్తమ క్రీడా పాలసీని రూపొందిస్తాం

హైదరాబాద్ , జులై 16:అత్యుత్తమ క్రీడా పాలసీని రూపొందిస్తామని క్రీడా, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ మినీ స్టేడియంలో ఒలింపిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన చీర్స్ ఫర్ ఇండియా కార్యక్రమంలో పాల్గొని ఒలింపిక్స్ జ్యోతిని ప్రముఖ మాజీ హాకీ ఆటగాడు, ట్రిపుల్ ఒలింపియన్ ముఖేష్ కుమార్ నుండి అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ క్రీడలకు పెద్ద పీట వేసి ప్రోత్సహిస్తున్నా రన్నారు.

అందులో భాగంగా రాష్ట్రంలో క్రీడా పాలసీని రూపొందించటానికి క్యాబినెట్ సబ్ కమిటీ ని నియమించారన్నారు. దేశంలోనే అత్యుత్తమ క్రీడా పాలసీ ని రూపొందించబోతున్నామని పేర్కొన్నారు. క్రీడల అభివృద్ధికి అన్ని నియోజకవర్గాల్లో క్రీడా మైదానాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 30 పైగా స్టేడియాల నిర్మాణం పూర్తి చేశామని వివరాలను వెల్లడించారు.

అలాగే ఒలింపిక్స్ లో పతకాలు సాధించే ఆటగాళ్లు కు నగదు పురస్కారాన్ని గతంలో కంటే ఎక్కువగా అందిస్తున్నా మన్నారు.తెలంగాణ రాష్ట్రం నుంచి , దేశం నుంచి ఒలింపిక్స్ వెళ్తున్న ఆటగాళ్లకు మంత్రి చీర్స్ చెప్పారు. ప్రతి ఆటగాడు తన శక్తి సామర్థ్యాలను కూడగట్టుకొని పతకాలు సాధించి దేశానికి పేరు ప్రఖ్యాతలు తేవాలని మర్థా? ఆకాంక్షించారు.

కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే అల వెంకటేశ్వర రెడ్డి, స్పోర్ట్స్ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఇంచార్జ్ అధ్యక్షుడు సముద్రాల వేణుగోపాల చారి, ఉపాధ్యక్షుడు ప్రేమ్ రాజ్, కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్, కార్పొరేటర్ శంకర్ యాదవ్, ట్రిపుల్ ఒలింపియన్ ముఖేష్, శాట్స్ అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ తెలంగాణ దిశగా సమిష్టి అడుగులు : ఎమ్మెల్యే భాస్కర్‌రావు

నల్లగొండ, జులై 16:: చెత్తతో మానవ జీవనానికి ముప్పు ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రజారోగ్యం, పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ స్వచ్ఛ తెలంగాణ దిశగా సమిష్టి అడుగులు వేయాలని మిర్యాలగూడ నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. మిర్యాలగూడ మున్సిపాలిటీ కార్యాలయాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్ కు చెందిన స్వాహా రిసోర్స్ మేనేజ్మెంట్ సంస్థ ప్రతినిధుల బృందం శుక్రవారం సందర్శించింది. ప్రతినిధి బృందం సభ్యులు మున్సిపాలిటీల అభివృద్ధి, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, డంపింగ్ యార్డుల ప్రాధాన్యం, చెత్త సేకరణ, రీసైక్లింగ్ తదితర అంశాలను వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాస్కర్ రావు మాట్లాడుతూ.. గుట్టలుగా పేరుకుపోయిన చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు వీలుగా ప్రభుత్వం డంపింగ్ యార్డుల నిర్మాణాలు చేపడుతోందన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ మార్గదర్శకాలకు లోబడి వీటి నిర్మాణాలను చేపడుతోందని చెప్పారు. ప్రతీ మున్సిపాలిటీ పరిధిలో సెగ్రిగేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఇప్పటికే ప్రకటించి ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసినట్లు తెలిపారు. పైలెట్ ప్రాజెక్ట్ గా నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట, ఖానాపూర్ ప్రాంతాల్లో వీటి నిర్మాణాలు చేపట్టినట్లు వెల్లడించారు.మిర్యాలగూడ మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపడుతున్నట్టు ఎమ్మెల్యే భాస్కర్‌రావు తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇండ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించేందుకు చెత్త బుట్టలను పంపిణీ చేసినట్లు తెలిపారు. పొడి చెత్తను రీసైక్లింగ్ ప్లాంట్ లకు తరలిస్తారని, తడి చెత్తను వర్మీ కంపోస్టు ప్లాంట్ లలో మూడు నెలలపాటు నిల్వ ఉంచి సేంద్రీయ ఎరువుగా మార్చి రైతులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఈ క్రమంలో భాగంగా పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, మున్సిపల్ చైర్మన్ తిరునగర్ భార్గవ్, కమిషనర్ చీమ వెంకన్న, ఎన్జీఆర్ ఫౌండేషన్ చైర్మన్, యువనేత నల్లమోతు సిద్ధార్థ, కౌన్సిలర్లు ఉదయ్ భాస్కర్, ఇలియాస్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నేటినిజం



కం॥ జోరున నార్థికశాస్త్రపు
దారులు వివరించి ఘన పి తామహుడు నుడుచునే
బేరును బాంధిన చిగురుని
యా రాధిం చెడును నతన "మాదం స్మిత్తున్" !!

(జులై 17 ఆర్థికశాస్త్ర పితామహుడు 'ఆదం స్మిత్' వర్ధంతి..)

–రాధశ్రీ
సెల్: 9494481210

కృష్ణా, గోదావరి బోర్డుల గెజిట్‌పై డైలాగ్ వార్

హైదరాబాద్ , జులై 16:తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోని ప్రాజెక్టులన్నీ కృష్ణా, గోదావరి బోర్డుల పరిధిలోకి రానున్నాయి. ఇందుకు సంబంధించిన గెజిట్లను కేంద్రం విడదల చేయడంతో తెలంగాణ నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఏపీ సీఎం జగన్, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇద్దరూ ప్రధాని మోదీ తమ్ముళ్లే అని సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. నీటి పంచాయితీ వెనుక రాజకీయ కుట్ర ఉందన్నారు. కేసీఆర్, జగన్ నీటి గొడవ పెద్ద డ్రామా అని పేర్కొన్నారు. జగన్, కేసీఆర్, షర్మిల, విజయమ్మ, బీజేపీ ఎవరి డ్రామా వారు ఆడుతున్నారని విమర్శించారు. తెలంగాణకు అన్యాయం జరిగితే ఊరుకోం అని స్పష్టం చేవారు.

కృష్ణానదిలో తెలంగాణ వాటా తెలంగాణకు ఇవ్వాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ డ్రామాలాడడం మానుకోవాలన్నారు. బోర్డులకు అధికారం ఇవ్వడం అన్యాయం అని అన్నారు. చర్చలతో పరిష్కరించు కోకుండా సీఎంలు వివాదం చేయడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు.

కేంద్ర ప్రభుత్వం గెజిట్ జారీ చేయడంపై తెలంగాణ సీఎం కేసీఆర్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. కేంద్రం గెజిట్ ఇవ్వడంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని టీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి.

మరోవైపు ఈ విషయంపై దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు స్పందించారు. తెలంగాణకు ఎప్పటికీ అన్యాయం జరగదన్నారు. రెండు రాష్ట్రాలు పెద్దన్న పాత్ర పోషించాలని కేంద్రాన్ని కోరడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఇరు రాష్ట్రాలకు సమన్యాయం చేసేందుకే గెజిట్ ను విడుదల చేశారని తెలిపారు. ఇది నీటి వాటాలకు సంబంధించింది కాదని, జల వివాదాన్ని పరిష్కరించేందుకే గెజిట్ అని స్పష్టం చేశారు.

అమరుల ఆకాంక్షలకు అనుగుణంగా కేసీఆర్ పాలన : ఎల్.రమణ

హైదరాబాద్ , జులై 16: అమరుల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని టీఆర్ఎస్ నాయకుడు ఎల్.రమణ అన్నారు. శుక్రవారం గన్‌పార్క్ వద్ద అమరులకు నివాళులర్పించిన ఆయన అనంతరం మీడియాతో మాటాడ్డారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలు మరువలేనివని అన్నారు. పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. మరికాసేపట్లో తన అనుచరులతో కలిసి సీఎం కేసీఆర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరనున్నట్లు ఎల్ రమణ తెలిపారు. అందరితో కలిసికట్టుగా పనిచేసి రాష్ట్రాభివృద్ధిలో పాల్పంచుకుంటానని అన్నారు.

తెలంగాణలో మరో మూడు రోజులపాటు వర్షాలు..

హైదరాబాద్ , జులై 16:తెలంగాణలో రాగల మూడు రోజుల పాటు వర్షాలు కురవనున్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఈ రోజు, రేపు, ఎల్లుండి భారీ వర్షాలు ఒకటి, రెండు ప్రదేశాల్లో కొన్ని జిల్లాలలో వచ్చే అవకాశాలు ఉన్నాయని అలాగే.. రాగల 3 రోజులు ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు తెలంగాణ రాష్ట్రంలోని ఒకటి, రెండు ప్రదేశాలలో పడే అవకాశాలు వున్నాయిని తెలిపింది. తూర్పు-పడమర షీర్ జోన్ ఇప్పుడు 3.1 కిమీ, 5.8 కిమీ మధ్య lat 15 ° N సముద్ర మట్టం ఎత్తుతో దక్షిణ దిశకు వంగి ఉందని పేర్కొన్న వాతావరణ శాఖ? మరా ఠ్వాడ & పరిసరాలపై ఉపరితల అవర్తనం ఇప్పుడు ఉత్తర మధ్య మహారాష్ట్ర & పరిసరాలపై, సగటు సముద్ర మట్టానికి 2.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని తెలిపింది.

బీజేపీకి భయపడేవారు కాంగ్రెస్ నుంచి వెళ్లవచ్చు: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, జులై 16:బీజేపీకి భయపడేవారు కాంగ్రెస్ పార్టీ నుంచి స్వేచ్ఛగా వెళ్లవచ్చని రాహుల్ గాంధీ అన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని నమ్మేవారు తమకు అవసరం లేదన్నారు. గత నెలలో బీజేపీలో చేరిన కాంగ్రెస్ నేత జితిన్ ప్రసాద నుద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సెల్‌లో కొత్తగా నియమితులైన వాలంటీర్లతో రాహుల్ గాంధీ శుక్రవారం మాట్లాడారు. బీజేపీ 'నకిలీ వార్తలకు' భయపడవద్దని వారికి సూచించారు. యూపీలో కరోనా నియంత్రణ, చైనాతో ఘర్షణపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై ప్రజలు నవ్వుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ నకిలీ వార్తల గురించి మాట్లాడే ప్రధాని మోదీని ప్రజలు నమ్మడం లేదని తెలిపారు.

ఈ సందర్భంగా పార్టీ వ్యతిరేకులను ఆర్ఎస్ఎస్ వ్యక్తులతో రాహుల్ గాంధీ పోల్చారు. బీజేపీకి భయపడే అలాంటి వారు కాంగ్రెస్‌ను వీడవచ్చని వ్యాఖ్యానించారు. బీజేపీ అంటే భయం లేని వారు తమకు కావాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో లేని చాలా మంది నిర్భయులు బయట ఉన్నారని, అలాంటి వారికి కాంగ్రెస్ పార్టీ స్వాగతం పలుకుతుందన్నారు.

2023 నుంచి ఏడు శాతం వృద్ధి రేటుతో దూసుకెళతాం : అరవింద్ సుబ్రమణియన్

ముంబై, జులై 16:: 2023 ఆర్థిక సంవత్సరం నుంచి దేశ జీడీపీ 6.5 శాతం నుంచి 7 శాతం వరకూ వృద్ధి చెందుతుందని ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ పేర్కొన్నారు. సంస్కరణల ఊతంతో పాటు కరోనా వ్యాక్సినేషన్ ప్రక్రియ ఊపందుకోవడం వృద్ధి రేటుకు ఊతమిస్తుందని అన్నారు.

కరోనా సెకండ్ వేవ్ ప్రభావం పెద్దగా లేదని ఆయన అంచనా వేశారు.

వలు సంస్కరణల ప్రభావం, వ్యాక్సినేషన్ ప్రక్రియ జోరందుకోవడంతో 2023 ఆర్థిక సంవత్సరం నుంచి దేశ ఆర్థిక వ్యవస్థ 6.5 నుంచి ఏడు శాతం వరకూ ఎదుగుతుందని తాను అంచనా వేస్తున్నానని సుబ్రమణియన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇక అప్పటి నుంచి వృద్ధి రేటు అంతకంతకూ పెరుగుతుందని అన్నారు. డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

గత ఏడాదిన్నరగా చేపట్టిన కీలక సంస్కరణలతో మరో దశాబ్దం పాటు భారత్‌లో అధిక వృద్ధి నమోదవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఇక కరోనా నుంచి ఆర్థిక వ్యవస్థ రికవరీకి సెకండ్ వేవ్ కొంతమేర విఘాతం కలిగించిందని ఆయన అంగీకరించారు.

చేనేత వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం : సీఎం కేసీఆర్

హైదరాబాద్ , జులై 16:తెలంగాణలో చేనేత వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామని.. ఇందుకు సంబంధించి త్వరలోనే శుభవార్త అందిస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. చేనేతల అభివృద్ధి కోసం చాలా చేశాం.. కానీ సరిపోవడం లేదు.. చేనేత వర్గం సమున్నతంగా బతికేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. చేనేతల బాధలను విముక్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని సీఎం కేసీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో ఎల్ రమణ టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రసంగించారు.

రమణకు మంచి రాజకీయ భవిష్యత్

రాష్ట్ర అభివృద్ధికి తన వంతు సహకారానికి రమణ టీఆర్ఎస్ పార్టీలో చేరారు. నిబద్ధత గల వ్యక్తి పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. రమణకు మంచి రాజకీయ భవిష్యత్ ఉంటుందన్నారు. టీఆర్ఎస్‌లో చేనేత వర్గానికి తగిన ప్రాతినిధ్యం లేదన్న లోటు రమణ చేరికతో తీరిందన్నారు. చేనేత సామాజిక వర్గం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. చేనేత కార్మికులకు రైతు బీమా కోసం ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. ఒకట్రెండు నెలల్లో చేనేతలకు బీమా వర్తిస్తుందని సీఎం తెలిపారు. వరంగల్ జిల్లాకు చెందిన చేనేత కార్మికులు సూరత్‌లో ఉన్నారు. ఈ క్రమంలో చేనేత కార్మికుల సమస్యలపై సూరత్‌కు అధికారులు పంపామని గుర్తు చేశారు. రాష్ట్రంలో జౌళి పరిశ్రమను ప్రోత్సహిస్తే తిరిగి వస్తామని చెప్పారు. వరంగల్‌లో వెయ్యి ఎకరాల్లో మెగా టెక్స్ టైల్స్ పార్కు ఏర్పాటు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు వస్తున్నారు. ఒక పారిశ్రామికవేత్త 3 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపారు అని సీఎం గుర్తు చేశారు.

ప్రజల ప్రత్యక్ష అనుభవంలో ప్రభుత్వ పథకాలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నీటి పారుదల రంగంలో నేరపూరిత నిర్లక్ష్యంతో తెలంగాణకు తీవ్ర నష్టం జరిగిందని సీఎం గుర్తు చేశారు. ఈ క్రమంలో రాష్ట్ర ఏర్పాటు కంటే ఆరు నెలల ముందే తెలంగాణ పునర్నిర్మాణం గురించి చర్చలు జరిగాయన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్, ఆర్ విద్యాసాగర్ రావు సమక్షంలో మిషన్ కాకతీయ వంటి పథకాలకు రూపకల్పన చేశామన్నారు. ఇప్పుడు ఈ పథకం అద్భుతంగా అమలవుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వ పథకాలు ప్రతి గ్రామంలో ప్రజల ప్రత్యక్ష అనుభవంలో ఉన్నాయని కేసీఆర్ తెలిపారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలని ప్రజలు అవకాశం ఇచ్చారు. చిన్న తప్పు దొర్లితే కొన్ని తరాలకు దెబ్బకొడుతుంది. అందుకనే అజెండా ప్రకారం మార్గదర్శకాలు రూపొందించి ముందుకెళ్తున్నామని కేసీఆర్ స్పష్టం చేశారు.

తెలంగాణకు ఉజ్వలమైన భవిష్యత్

తెలంగాణ ఏర్పాటు అయితే ధనిక రాష్ట్రంగా మారుతామని రాష్ట్రం ఏర్పడక ముందే చెప్పానని సీఎం కేసీఆర్ గుర్తు చేశారు. ఇండియాలోనే నంబర్ వన్ జీతాలు ఇస్తామని చెప్పాం. అది జరుగుతుంది. తెలంగాణ ఉద్యోగులు దేశంలోనే మంచి జీతాలు అందుకుంటున్నారు. నిన్న 40 ఎకరాలు అమ్మితే రూ. 2 వేల కోట్లు వచ్చాయి. ఇలా వచ్చిన ప్రజా ధనాన్ని ప్రజల సంక్షేమం కోసమే వినియోగిస్తామని తేల్చిచెప్పారు. తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత భూ వివాదాలు లేవు. రైతులు సంతోషంగా ఉన్నారు. తాను ఏ తెలంగాణను కోరుకున్నానో.. అది ఆవిష్కరించి తీరుతానని, రాబోయే రోజుల్లో తెలంగాణకు ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.

తెలంగాణ రచయితల సంఘం జంటనగరాలు
తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం

సంయుక్త ఆధ్వర్యంలో

గజవెల్లి దశరథరామయ్య గారి అక్షర గుళికలు
గేయ కవితా సంపుటి

ఆవిష్కరణ సభ

తేది : 20-7-2021 సా॥ 5 గం॥లకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం TPSK షోయబ్‌హాల్

అధ్యక్షులు : శ్రీ కందుకూరి శ్రీరాములు
అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం జంట నగరాలు

ముఖ్య అతిథి : డా॥ నందిని సిధారెడ్డి
తొలి పూర్వ అధ్యక్షులు,తెలంగాణ సాహిత్య అకాడమీ

అంకితం : శ్రీ అశ్వాపురం వేణుమాధవ్
అధ్యక్షులు, తెలంగాణ చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం

విశిష్ట అతిథి : శ్రీ బైసదేవదాస్
సంపాదకులు, నేటినిజం

ఆత్మీయ అతిథులు : శ్రీ ఆనందాచారి
ప్రధానకార్యదర్శి, తెలంగాణ సాహితీ

శ్రీ భూపతి వెంకటేశ్వర్లు
సంపాదకులు,మోదుగుపూలు

శ్రీ తంగిరాల చక్రవర్తి
ఉపాధ్యక్షులు, తెలంగాణ సాహితీ

డా॥ బెల్లంకొండ సంపత్ కుమార్
ప్రధాన కార్యదర్శి, తె.ర.సం. జంటనగరాలు

శ్రీ పాత్తూరు సుబ్బారావు
సంపాదకులు, సాహితీ కిరణం

కవి సమ్మేళనం

శ్రీ కందాళై రాఘవాచార్య
శ్రీ వేణుశ్రీ
శ్రీ రఘువీర్ ప్రతాప్
శ్రీ పెద్దూరి వెంకటదాసు
శ్రీ మోహనకృష్ణ
డా॥ సి.హెచ్. సీతాలక్ష్మి
డా॥ సరోజ వింజామర
శ్రీ మార్గం కృష్ణమూర్తి
శ్రీ జె.వి. రావు
శ్రీ కనకా చారి
శ్రీ నక్క హరికృష్ణ

వందన సమర్పణ : కృష్ణమూర్తి సాలార్‌జంగ్ మ్యూజియం, ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ

ఆఫ్‌లైన్ చదువుల చక్రం సాగేదెపుడు?!

మార్చి 2020 నుంచి కరోనా కమ్మిన కారు చీకట్లను తప్పించుకోవడానికి లాక్‌డౌన్‌లు, కర్ఫ్యూలు, భౌతికదూరాలు, మాస్కుల ధారణలు, సానిటైజర్ల వాడకాలు, స్వచ్ఛంధ గృహ నిర్బంధాలు లాంటి జీవనశైలిలో మార్పులు అనతికాలంలోనే అలవాటు అయ్యాయి. పాఠశాలలు, కళాశాలల తలుపులు మూసివేయడంతో ఆన్‌లైన్ తరగతుల స్మార్ట్ తెరలు తెరుచుకున్నాయి. 2020లో భారత దేశంలోని 1.5 మిలియన్ పాఠశాలలు, 320 మిలియన్ల బాలలు బడికి దూరంగా ఉంటూ వర్చువల్ క్లాస్‌లకు హాజరు కావడం లేదా చదువులకు దూరంగా ఉండడమవుతున్నది. బడుల మూసివేత కారణంగా ప్రభుత్వాలు, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, సాధారణ ప్రజలు పిల్లల భవిష్యత్తుపై పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ చదువుల లోపాలు :

విద్యాలయాలు తెరవకపోవడంతో విద్యార్థినీవిద్యార్థుల చదువులు మాత్రమే కాకుండా వారి శారీరక మానసిక ఆరోగ్యం పట్ల దీర్ఘకాలిక దుష్ప్రభావాలు కనిపిస్తున్నాయి. అన్ని ఆర్థికవర్గాల ప్రజలకు స్మార్ట్‌ఫోన్‌లు అందుబాటులో లేకపోవడమే కాకుండా ఇంటర్నెట్ సౌకర్యాలు లోపించడంతో ఆన్‌లైన్ తరగతులు పేదవర్గాలకు దూరం అయ్యాయి. బాలకార్మికులు, బాల్యవివాహాల సంఖ్య పెరిగి పోయింది. ఉపాధ్యాయులతో ప్రత్యక్ష సంబంధం తెగడంతో క్రమశిక్షణ లోపించింది. ఇంట్లో ఉండాలనే నియమంతో శారీరక వ్యాయామం, క్రీడలకు దూరం అయ్యారు. తల్లితండ్రులు పనికి వెళ్ళడంతో పిల్లలు మానసికంగా కుంగి పోవడం జరిగింది. పేద పిల్లలు మద్యాహ్న భోజన వసతికి దూరం కావడంతో పోషకాహార లోపంతో శారీరక పెరుగుదల మందగించింది. ఆన్‌లైన్ తరగతులకు హాజరు తప్పనిసరి కానందున విద్యార్థులు తరగతులకు గైర్హజరు పెరిగింది. దినచర్య అస్తవ్యస్తం అయ్యింది. నేడు 10వ తరగతి పాసైన విద్యార్థులు అవసర నైపుణ్యాల్లో రెండేళ్ళు వెనుకబడ్డారు. దీర్ఘకాలం పాఠశాలలు తెరవనందున విద్యా ప్రమాణాలు పడిపోయాయి. ఆన్‌లైన్ తరగతులతో పేదరికం పెరుగుతున్నది. నవంబర్ 2020 సర్వే వివరాల ప్రకారం 66 శాతం పేద పిల్లలు డ్రాపవుట్ కావచ్చనే భయంకర వాస్తవం బయట పడింది. ప్రైవేట్ పాఠశాలల్లో 42 శాతం అడ్మిషన్లు తగ్గాయి. ధనికవర్గాల పిల్లలు కూడా ఆన్‌లైన్ తరగతులతో మానసిక ఆరోగ్యాన్ని కోల్పోయారు. ధనికవర్గాల పిల్లలు మాదకద్రవ్యాల దురలవాటుకు దగ్గరైనారు. చదువుల కన్న ప్రాణాలు ప్రధానమైనవే అయినప్పటికి ఆన్‌లైన్ తరగతులతో అన్ని తరగతుల పిల్లల విద్యా ప్రమాణాలు పాతాళానికి జారడం, తరాల నైపుణ్య అంతరం ఏర్పడి, వ్యక్తిత్వ వికాసం తిరోగమన దిశకు చేరడం జరుగుతుందని గమనించాలి.

పరీక్షల నిర్వహణ, హోమ్ వర్క్ పరిశీలన, విద్యార్థి పాఠ్యాంశాల అవగాహనను తెలుసు కోవడం, క్రీడలు ఆడించడం, పలు రకాలైన పోటీల నిర్వహణ లాంటివి వీలు కావడం లేదు.

పిల్లలపై కరోనా ప్రభావం :

పిల్లలు పుస్తకాల సంచి భుజాన వేసుకొని పాఠశాల దారి పట్టడానికి సంబంధించిన పలు అంశాలను శాస్త్రీయ కోణంలో విశ్లేషించే ప్రయత్నాలు చేస్తున్నారు. కోవిడ్-19 మహమ్మారి సోకడానికి కారణమైన 'ఏయస్ఈ2 రిసెప్టైర్లు' పిల్లల శ్వాసకోశంలో తక్కువగా ఉండడంతో కరోనా సంక్రమించే అవకాశం తగ్గుతున్నది. కరోనా రెండవ వేవ్‌తో పిల్లల క్షేమం, ఆరోగ్య భద్రత పట్ల సమాజం తపన పడుతున్నది. పెద్దలతో పోల్చితే పిల్లల్లో వ్యాధినిరోధకశక్తి అధికంగా ఉండడంతో కరోనా సోకే అవకాశాలు చాలా తక్కువగా ఉంటున్నాయి. పిల్లలకు కరోనా సోకినప్పటికీ దాదాపు 90 శాతం కోవిడ్-19 లక్షణాలు కనబడకుండా 'ఏసిమ్టమాటిక్ లేదా మైల్డ్'గా ఉంటాయి. కరోనా సోకిన పిల్లల్లో 1-2 శాతం మాత్రమే ఆసుపత్రుల్లో చికిత్స తీసుకునేంత తీవ్రతతో కోవిడ్-19 లక్షణాలు కనిపిస్తాయి. ముంబాయ్‌లో చేసిన సర్వేలో 19-ఏండ్ల లోపు పిల్లల్లో కరోనా 0.003 శాతం మాత్రమే ప్రాణాంతకం కావచ్చని తేలింది. కోవిడ్-19కు పూర్వం పిల్లల మరణాల రేటు 3 శాతం ఉండగా, కరోనా కాలంలో 0.18 శాతం మాత్రమే నమోదు అయ్యింది. ఇతర అనారోగ్యాలతో బాధపడే పిల్లల్లో కోవిడ్-19 చికిత్స మరింత కష్టం అవుతున్నది. ఈ పరిశీలనలను బట్టి పాఠశాల విద్యార్థుల్లో కోవిడ్-19 ప్రభావం చాలా తక్కువని తలుస్తున్నది. 3వ వేవ్ విజృంభిస్తే కొత్త వేరియంట్లతో పిల్లలకు కూడా ప్రమాదకారిగా మారవచ్చని అంచనా వేస్తున్నారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పెడియాట్రిక్స్ వివరాల ప్రకారం లక్షలో 12 మించి పిల్లలకు కోవిడ్-19 కారణంగా 'మల్టీసిస్టమ్ ఇన్‌ఫ్లమేటరీ సిండ్రోమ్ ఇన్ చిల్డ్రన్ (యంఐయస్-సి)' అనబడే వ్యాధి అధికంగా కనిపిస్తుంది. తగు వైద్య జాగ్రత్తలు తీసుకున్నపుడు పిల్లలకు ప్రాణాపాయం తగ్గుతుందని తేలింది. విదేశీ పాఠశాలల్లో జరిపిన సర్వే వివరాల ప్రకారం 0.5 - 1.7 శాతం పిల్లలకు మాత్రమే కరోనా సోకవచ్చని తెలిసింది. పాఠశాలల్లో ఉపాధ్యాయులు పిల్లలకు దూరంగా ఉంటూ, ఓపెన్ గ్రౌండ్స్‌లో తరగతులు నిర్వహించాలని సూచిస్తున్నారు. సమాజంలో పెద్దల నుంచి పిల్లలకు కరోనా సోకిన సందర్భాలు ఉన్నప్పటికీ, పిల్లల నుంచి పిల్లలకు వ్యాపించే అవకాశాలు తక్కువగా ఉండడంతో పాఠశాలలు తెరవడమే ఉత్తమమని వాదించే వారి సంఖ్య పెరుగుతోంది. ఇజ్రాయిల్ పాఠశాలల్లో తగు జాగ్రత్తలు తీసుకోనందున 15 శాతం మంది పిల్లలకు కరోనా సోకడం కనిపించింది. వైరస్ కన్న పిల్లల ఆరోగ్య భద్రత, విద్య పట్ల తల్లితండ్రులు అధికంగా ఆవేదన చెందుతున్నారు.

జిల్లా కేంద్రాలు, చిన్న పట్టణాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో దినసరి కరోనా కేసుల సంఖ్య, పాజిటివ్ రేటు అనే వివరాలను బట్టి పాఠశాలలు తెరవవచ్చు. పాఠశాలలు తెరవడానికి ముందు మాస్కులు, భౌతిక దూరాలు, సానిటైజర్లు, నాన్-ఏసి తరగతి గదిల్లో సరైన వెంటిలేషన్ ఉంచుకోవడం లాంటి అంశాలను ఉపాధ్యాయులతో పాటు పిల్లలకు తప్పనిసరి చేయాలి. విద్యార్థుల మధ్య భౌతిక దూరాలు ఉండేలా చూసుకోవడం, తక్కువ క్లాసులు నిర్వహించడం, తక్కువ సమయంతో పీరియడ్ తీసుకోవడం, తరుచుగా కోవిడ్-19 పరీక్షలు నిర్వహించడం, కోవిడ్-19 సోకిన ఉపాధ్యాయులు/విద్యార్థినీ విద్యార్థులకు వైద్య అందించడం, క్వారంటైన్, ఐసొలేషన్, శరీర ఉష్ణోగ్రత పరీక్షించడం లాంటివి చేయాలి. యువత కన్న పిల్లలకు కరోనా సోకడం తక్కువని తెలుస్తున్నది. ఉన్నత పాఠశాలల కన్న ముందు ప్రాథమిక పాఠశాలలు తెరవడం శ్రేయస్కరమని గమినించాలి. వీటికి తోడుగా 18 ఏండ్లు దాటిన వారందరూ టీకాలు వేయించు కోవడం మానకూడదు. 18 ఏండ్ల లోపు పిల్లలకు కూడా టీకా అందుబాటులోకి రానుంది. పిల్లల మానసిక, భావోద్వేగ, మానసిక, మేధో అభివృద్ధి సుసాధ్యం కావడానికి పాఠశాలలు తెరవడమే ఉత్తమమని అంటున్నారు. ఈ కరోనా సంధికాలంలో శాస్త్రసాంకేతికతను త్వరితగతిన విద్యార్థిలోకానికి అవగాహన కలుగజేసి, ఆన్‌లైన్ క్లాసులను నిర్వహించడంలో ప్రాణాలను పణంగా పెడుతూ 'చదువుల చక్రం ఆగకూడనే' సూత్రానికి కట్టుబడుతూ, ఉపాధ్యాయులు చూపిన చొరవ ప్రశంసనీయమని అంగీకరించాల్సిందే. ఇదే క్రమంలో నేడు తిరిగి ప్రత్యక్ష తరగతులు నిర్వహించే సవాళ్లను సమర్థవంతంగా ఎదురించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను పిల్లలకు వివరిస్తూ మరోసారి 'మన గురువులు' గురుతర భాధ్యతలను తిరిగి తీసుకోవలసి ఉంది. ఆఫ్‌లైన్ తరగతులు త్వరలోనే ప్రారంభమై, విద్యార్థులు తమ సాధారణ భౌతిక తరగతులకు హాజరవుతూ, కరోనాతో కోల్పోయిన మానసిక శారీరక భావోద్వేగ వికాసాలను తిరిగి పొందాలని కోరుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

హుజురాబాద్ ఉపఎన్నికపై షర్మిల మనసులో మాట!

హైదరాబాద్ , జులై 16:తెలంగాణలో త్వరలో తాను పాదయాత్ర చేయబోతున్నట్లు వైఎస్ఆర్టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రకటించారు. వైఎస్ లాగే తాను కూడా చేవెళ్ల నుంచి పాదయాత్ర ప్రారంభిస్తానని షర్మిల వెల్లడించారు. త్వరలో జరిగే హుజురాబాద్ ఉపఎన్నికపై షర్మిల ఆసక్తిక వ్యాఖ్యలు చేశారు. హుజూరాబాద్ ఉపఎన్నికకు అర్థమే లేదన్నారు. పగలు, ప్రతీకారాల కోసం హుజూరాబాద్ ఉపఎన్నికను తెరపైకి తీసుకువచ్చారని మండిపడ్డారు. ఎన్నికలతో ప్రజలకు ఏమైనా మేలు జరుగుతుందా ? అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ విఫలమయ్యారని విమర్శించారు. ఆయన తనకొచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేశారని తెలిపారు. తెలంగాణకు ముఖ్యమంత్రి ఎవరు..? కేసీఆరా.. లేకుంటే ఆయన కొడుకా..? అని ప్రశ్నించారు. ఉద్యమకారుడిగా కేసీఆర్‌పై తనుకు ఎంతో గౌరవం ఉందన్నారు. అయితే, సీఎం అయ్యాక కేసీఆర్‌లోని దొర బయటికొచ్చారని పేర్కొన్నారు.

సెకండ్ వేవ్ కంటే థర్డ్ వేవ్ దారుణంగా ఉంటుంది: ఎయిమ్స్ చీఫ్

హైదరాబాద్ , జులై 16:కరోనా సెకండ్ వేవ్ కారణంగా దేశ ప్రజలు ఎంతగా వణికిపోయారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కరోనా బాధితులకు ఆస్పత్రుల్లో బెడ్స్ లేక, ఆక్సిజన్ అందక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఆస్పత్రుల బిల్లులు కోసం కొంతమంది ఆస్తులు కూడా అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అటు స్మశానాల్లో అయితే కరోనా మృతదేహాలను ఖననం చేసేందుకు కూడా క్యూలైన్లు దర్శనమిచ్చాయి.

ఈ నేపథ్యంలో ఢిల్లీ ఎయిమ్స్ చీఫ్ డా.రణదీప్ గులేరియా కరోనా థర్డ్ వేవ్‌పై పలు విషయాలను వెల్లడించారు. కరోనా థర్డ్ వేవ్ వస్తే సెకండ్ వేవ్‌ను మించి ఉంటుందన్నారు. దేశంలో కరోనా సెకండ్ వేవ్ ముగుస్తున్నందున ఆంక్షలను సడలిస్తున్నారని? కానీ ఆంక్షల సడలింపులో ఏమాత్రం తేడా వచ్చినా కేసులు పెరుగుతాయన్నారు. ఇప్పటికే ఈశాన్య రాష్ట్రాలు, కేరళలో కేసులు పెరుగుతున్నాయని, ఆంక్షలు సడలించటం ద్వారా కొత్త వేరియంట్లు పుట్టుకొస్తూ కేసులు పెరిగే ప్రమాదం ఉందన్నారు. అదే జరిగితే థర్డ్ వేవ్ భయంకరంగా ఉంటుందని డా.రణదీప్ గులేరియా హెచ్చరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న వ్యాక్సిన్లు పనిచేస్తున్నాయని వివరించారు. ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేయించుకుంటే మరణాల శాతాన్ని తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. అందుకే థర్డ్ వేవ్ రాకముందే ప్రజలందరూ టీకాలు తీసుకోవటం మంచిదని ఆయన సూచించారు.

అమెజాన్ సరికొత్త ఆఫర్.. రూ.2కే నాలుగు నెలల సబ్‌స్క్రిప్షన్

హైదరాబాద్ , జులై 16:పుస్తకాల ప్రియుల కోసం అమెజాన్ సరికొత్త ఆఫర్‌ను ప్రకటించింది. అమెజాన్‌కు చెందిన అడిబుల్ యాప్ నాలుగు నెలల సబ్‌స్క్రిప్షన్ కేవలం రూ.2 కే అందించనుంది. అడిబుల్‌లో వినియోగదారులు పుస్తకాలను వినవచ్చు. అంతేకాకుండా విభిన్నమైన పాడ్‌కాస్ట్‌లను కూడా అడిబుల్ అందిస్తోంది. ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ తన వెబ్‌సైట్‌లో ఈ ఆఫర్ అందుబాటులో ఉంచింది. అంతేగాకుండా ఈ ఆఫర్ కేవలం మొదటిసారి జాయిన్ అయ్యే కస్టమర్లకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేసింది.

కాగా అడిబుల్ సబ్‌స్క్రిప్షన్ తీసుకున్నట్లయితే పుస్తకప్రియులు వారికి నచ్చిన పుస్తకాలను నచ్చిన సమయంలో వినవచ్చు. ఇక ఈ అడిబుల్ సబ్‌స్క్రిప్షన్‌ను కూడా అమెజాన్ కేవలం రూ.199కి మాత్రమే అందిస్తుంది. అయితే ఈ ఆఫర్ కేవలం అమెజాన్ ప్రైమ్ యూజర్లకు మాత్రమే వర్తించనుంది.

'చలో రాజ్‌భవన్'లో ఉద్రిక్తత.. పోలీసులను వదలం: రేవంత్

హైదరాబాద్ , జులై 15:పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'చలో రాజ్‌భవన్' కార్యక్రమంలో ఉద్రిక్తత నెలకొంది. ఇందిరా పార్క్ వద్దకు వచ్చిన రేవంత్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందిరా పార్క్ వద్ద జరిగిన సమావేశంలో ప్రసంగించిన రేవంత్ రెడ్డి.. కార్యకర్తలతో కలిసి రాజ్ భవన్ వైపు పాదయాత్రగా బయలుదేరారు. ఇదే సమయంలో పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి అక్కడినుంచి తీసుకెళ్లారు.

రేవంత్ ను అరెస్ట్ చేసే సమయంలో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులకు కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. రేవంత్ అరెస్ట్ ను ఖండిస్తూ కాంగ్రస్ కార్యాకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కొందరు రేవంత్ తీసుకెళ్తున్న వాహనం వెంట వెళ్లారు. ఈ నేపథ్యంలోనే పోలీసులు మరికొందరిని అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు. జిల్లాల్లోనూ చాలా మంది కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టులు చేశారు.

కాంగ్రెస్ నాయకులను బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారని టీ.పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఈ రకమైన అరెస్టులు చేసి పోలీసులతో పరిపాలన చేయాలని సీఎం కేసీఆర్ అనుకుంటే తీవ్రమైన పరిణామలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. అధికారులు సీఎం ప్రైవేటు సైన్యంలా వ్యవహరిస్తే.. ఎవరినీ వదిలిపెట్టమని వార్నింగ్ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వారిపై చర్యలు తీసుకుంటామని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. తాము చేస్తున్న కార్యక్రమం ప్రజల కోసమని చెప్పారు. 40 రూపాయల పెట్రోల్‌కు 65 రూపాయల పన్ను వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పుట్టింటి మీద అలిగితే పార్టీలు పెట్టరు: షర్మిల

హైదరాబాద్ , జులై 16:తెలంగాణలో కొత్త పార్టీని స్థాపించిన వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి తెలంగాణ వ్యతిరేకి కాదని షర్మిల స్పష్టం చేశారు. వైఎస్ తెలంగాణకు మంచి చేశారా..ద్రోహం చేశారా..గ్రామాలకు వెళ్లి అడగాలని అన్నారు. వైఎస్ చనిపోయాకే తెలంగాణ మలిదశ ఉద్యమం మొదలైందని షర్మిల గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ అవసరం అని 41 మంది ఎమ్మెల్యేలతో కలిసి చెప్పారని గుర్తు చేసిన షర్మిల?యూపీఏ మ్యానిఫెస్టోలో కూడా తెలంగాణ ఏర్పాటు అంశం చేర్చారని తెలిపారు. తన తండ్రి ప్రేమించిన తెలంగాణ ప్రజలకు అన్యాయం జరుగుతోందన్నారు. ప్రజల కోసం నిలబడే.. పోరాడే పార్టీ వైఎస్సార్ టీపీ అని స్పష్టం చేశారు.

పుట్టింటి మీద అలిగితే పార్టీలు పెట్టరని షర్మిల వ్యాఖ్యానించారు. ఏపీ సీఎం జగన్? మీద అలిగితే.. మాట్లాడ్డం మానేస్తాను కానీ పార్టీ పెట్టనని అన్నారు. ఏపీలో రాజన్న రాజ్యం వస్తున్నట్లే కనిపిస్తోందన్న షర్మిల.. తెలంగాణలో రాజన్న రాజ్యం తీసుకురావడమే ధ్యేయంగా పార్టీ పెట్టినట్లు తెలిపారు. వైఎస్సార్ ఆశయ సాధన కోసం ఈ పార్టీ స్థాపించామన్నారు. కృష్ణా జలాల అంశాలను కేసీఆర్ ఏనాడైనా సీరియస్‌గా తీసుకున్నారా అని ప్రశ్నించారు. తెలంగాణకు దక్కాల్సిన చుక్క నీటిబొట్టును వదులుకోమని స్పష్టం చేశారు. టీఆర్ఎస్‌లో ఎంత మంది మహిళలున్నారని.. మీటింగ్ జరిగితే మహిళా సర్పంచ్‌కు కూడా కుర్చీ ఇవ్వరని విమర్శించారు. కేసీఆర్ దృష్టిలో మహిళలంటే వంటింట్లో ఉండాలని, వ్రతాలు చేసుకోవాలి షర్మిల అన్నారు. నిరుద్యోగుల కోసం తాను వ్రతమే చేస్తున్నానని అన్నారు

రాష్ట్రంలో అన్ని గోతులే.. ఎంపీ రఘురామ సెటైర్లు

అమరావతి, జులై 16:ఏపీ సీఎం జగన్ కు పలు అంశాలపై నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు రోజుకో లేఖ పంపుతున్నారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రోడ్ల దుస్థితిని వివరిస్తూ లేఖలో తనదైన శైలీలో విమర్శలు గుప్పించారు. రాజుగారి ఇంటికి అడ్రస్ చెబుతారా..? అంటూ ప్రారంభించి.. "ఇక్కడి నుంచి నాలుగు గోతులు దాటాక కుడివైపు తిరిగితే.. మరో పది గోతులు కనిపిస్తాయి.. అవి దాటాక పెద్ద గొయ్యి వస్తుంది. ప్యాంట్ పైకి లాగి ఎడమవైపు తిరుగు ఆరు గోతులు ఉంటాయి.. వాటిని దాటి ముందుకెళ్తే కరెంట్ స్తంభం ఉంటుంది. దాని పక్కనే రాజుగారి ఇల్లు. ఆ కరెంట్ స్తంభం ముట్టుకోకు.. స్తంభింపజేస్తుంది కరెంటు పాస్ అవుతుంది" అంటూ రాష్ట్రంలో రోడ్ల పరిస్థితిపై సెటైర్ వేశారు.ఏపీలో రహదాం "లన్నీ అధ్వాన్నంగా తయారయ్యాయని? వాటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ రఘురామ లేఖలో తెలిపారు. వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని తక్షణమే మరమ్మత్తు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సీఎంకు సూచించారు. బతుకు బండి లాగడమే కష్టంగా ఉన్న ఈ రోజుల్లో రోడ్డు మీద బండి తోలడం మరింత సంక్లిష్టంగా తయారైందన్నారు. మరమ్మతులు చేయని కారణంగా రహదారుల పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. కోస్తా తీర ప్రాంతాలలో రోడ్లు కొట్టుకుపోయి యమకూపాలుగా మారాయన్నారు. సీఎం కొంత కాలం పాటు హెలికాప్టర్లు, విమానాలలో ప్రయాణం చేయవద్దని.. త్వరలో ప్రారంభించే రచ్చబండ కార్యక్రమానికి రోడ్డు మార్గంలో వెళ్లాలని రఘురామ సూచించారు. అలా వెళితే మీ పాలనలో రోడ్లు ఎంత బాగున్నాయో మీరే కనులారా వీక్షించవచ్చని రఘురామ లేఖలో పేర్కొన్నారు.

ఆర్డీఎస్ కుడికాల్వ పనులు చేపట్టవద్దు: ఏపీ ప్రభుత్వానికి కేఆర్ఎంబీ లేఖ

హైదరాబాద్ , జులై 16:జల వివాదాలపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్న నేపథ్యంలో కేఆర్ఎంబీ తీవ్రంగా స్పందించింది. కేఆర్ఎంబీ సభ్యుడు హరికేశ్ మీనా ఏపీ ఈఎన్సీకి లేఖ రాశారు. ఆర్డీఎస్ (రాజోలిబండ డైవర్షన్ స్కీమ్) కుడి కాల్వ పనులను చేపట్టవద్దని స్పష్టం చేశారు. బోర్డుకు డీపీఆర్ సమర్పించకుండా, ఆమోదం పొందకుండా పనులు చేయవద్దని తేల్చి చెప్పారు. హరికేశ్ మీనా అటు తెలంగాణ ఈఎన్సీకి కూడా లేఖ రాశారు. చిన్న నీటివనరులకు తెలంగాణ అధిక నీరు తీసుకుంటోందని ఏపీ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తెలంగాణకు 89.15 టీఎంసీలు కేటాయిస్తే 175.54 టీఎంసీలు తీసుకుందని ఆరోపించినట్టు వివరించారు. ప్రాజెక్టుల నుంచి కృష్ణా జలాలను తరలించకుండా చూడాలని ఏపీ కోరిందని తెలిపారు. ఏపీ ఫిర్యాదుపై అభిప్రాయం చెప్పాలని మీనా తెలంగాణను కోరారు.

మరోవైపు కేఆర్ఎంబీ మరో సభ్యుడు మౌంతాంగ్ తెలంగాణ జెన్ కో డైరెక్టర్ కు లేఖ రాశారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, పులిచింతల ప్రాజెక్టుల నుంచి జలవిద్యుదుత్పత్తి చేపట్టరాదని తెలంగాణను ఆదేశించారు.

విద్యార్థులు ఉంటేనే పాఠశాలల్లో టీచర్ పోస్టుల భర్తీ

హైదరాబాద్ , జులై 16:తెలంగాణలోని పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులున్న పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టులనే భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. విద్యార్థుల్లేని స్కూళ్లలో ఖాళీ పోస్టులను భర్తీ చేయకూడదని భావిస్తోంది. విద్యార్థులే లేనప్పుడు ఈ ఖాళీల భర్తీ ఎందుకని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ప్రతిపాదనలు ప్రభుత్వం అంగీకరిస్తే సుమారు 2 వేల టీచర్ పోస్టులు భర్తీకి నోచుకునే అవకాశం లేదు.

ఈ క్రమంలోనే విద్యార్థులు లేని స్కూళ్లలోని ఖాళీ పోస్టులను, విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలల్లోని ఖాళీ పోస్టులను వేర్వేరుగా గుర్తించి ప్రతిపాదనలను పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీనికి అనుగుణంగా పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. దీని ప్రకారం విద్యార్థుల్లేని పాఠశాలల్లో 2వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు గుర్తించారు. ఇవన్నీ ఎక్కువగా ప్రైమరీ స్థాయిలోనే ఉన్నట్టు తేలింది. ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ గురువారం ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. రాష్ట్రంలో 12 వేల ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నట్టు నిర్ధా రణకు వచ్చారు. సాధారణంగా ఒక్కో టీచరుకు ప్రాథమిక పాఠశాల స్థాయిలో 20 మం ది, హైస్కూలు స్థాయిలో 50 మంది విద్యార్థులుండాలి. అలా లేకుంటే వాటిని మూసేసి సమీప స్కూళ్లకు అనుసంధానిస్తారు. అలాగే జీరో అడ్మిషన్ల స్కూళ్ల సంఖ్య కూడా పెరుగుతోంది.

ఇంట్లో టీకా వేయించుకున్న బీజేపీ ఎంపీ.. కాంగ్రెస్‌కు ఆయుధం

న్యూఢిల్లీ, జులై 16:మధ్యప్రదేశ్ కు చెందిన బీజేపీ ఎంపీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ మరో వివాదంలో చిక్కుకున్నారు. తన ఇంట్లోనే కరోనా వ్యాక్సిన్ వేయించుకున్న వీడియో వైరల్ కావడంతో ఆమెపై కాంగ్రెస్ పార్టీ విమర్శలకు దిగింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ప్రారంభించిన 'హోం వ్యాక్సినేషన్ డ్రైవ్'లో భాగంగా భోపాల్ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ తన ఇంట్లోనే వ్యాక్సిన్ వేయించుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్ చల్ చేసింది. దీంతో ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలు ఆ వీడియోపై సీరియస్‌గా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ప్రజ్ఞా ఠాకూర్ ఓ పెళ్లిలో హుషారుగా డ్యాన్సులు వేశారని, వ్యాక్సిన్ సెంటర్‌కు వెళ్లి టీకా వేయించుకోలేరా అని ప్రశ్నిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ సహా బీజేపీ నేతలంతా వ్యాక్సినేషన్ సెంటర్లలోనే కరోనా టీకా వేయించుకున్నారని తెలిపారు. మరి ప్రజ్ఞాకు మాత్రం మినహాయింపు ఎందుకు? అని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు.

శ్రీవారి హుండీలో 157 దేశాల కరెన్సీ నోట్లు

తిరుపతి, జులై 16: తిరుమల శ్రీవారి హుండీలో మన దేశ కరెన్సీనే కాకుండా పలు దేశాలకు చెందిన కరెన్సీ వచ్చి చేరుతోంది. విదేశీ భక్తులు వారి కరెన్సీని హుండీలో వేస్తున్నారు. ప్రపంచంలో మొత్తం 195 దేశాలు ఉండగా? శ్రీవారి హుండీలో 157 దేశాల కరెన్సీ వచ్చింది. విదేశీ కరెన్సీ విషయానికి వస్తే మలేషియా కరెన్సీ నోట్లు అత్యధికంగా 46 శాతం వచ్చాయి.

మలేషియా కరెన్సీ తర్వాతి స్థానంలో అమెరికా డాలర్లు ఉన్నాయి. శ్రీవారి హుండీలో అమెరికా డాలర్లు 16 శాతం వచ్చాయి. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే స్వామి వారికి వచ్చిన విదేశీ కరెన్సీలో పాకిస్థాన్ నోట్లు కూడా ఉన్నాయి. 2019-20 సంవత్సరంలో విదేశీ కరెన్సీ రూపంలో శ్రీవారికి రూ. 27.49 కోట్ల ఆదాయం వచ్చింది. కరోనా కారణంగా ఈ ఏడాది విదేశీ నోట్లు తగ్గే అవకాశం ఉంది.

విజయవాడలో స్పైస్ జెట్ సర్వీసులు షురూ

విజయవాడ ,జులై 16: విజయవాడ విమానాశ్రయంలో స్పైస్ జెట్ విమాన సర్వీసులు శుక్రవారం నుంచి పునఃప్రారంభమయ్యాయి. కోవిడ్ సెకండ్ వేవ్ నేపథ్యంలో విజయవాడకు స్పైస్ జెట్ సర్వీసులు నిలిచిపోయాయి. అయితే, ప్రస్తుతం కరోనా కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టడంతో తిరిగి ఇవాళ్టి నుంచి సర్వీసులు మొదలయ్యాయి. దాదాపు మూడు నెలల సుదీర్ఘ విరామం అనంతరం బెంగళూరు స్పైస్ జెట్ సర్వీస్ విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంది.

మరోవైపు విజయవాడ విమానాశ్రయం నుంచి 2 నెలలుగా ఆగిపోయిన అంతర్జాతీయ సర్వీసులు త్వరలో ప్రారంభంకానున్నాయి. ఈనెల 20 నుంచి ప్రతి మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు మస్కట్‌కు విమాన సర్వీసు నడపనున్నారు. టికెట్లు బుక్ చేసుకునేందుకు ప్రయాణికులకు అనుమతి ఇచ్చారు. అంతర్జాతీయ సర్వీసులకు అనుగుణంగా విస్తరించిన రన్‌వేను ఇప్పటికే ప్రారంభించారు.

వణుకుతున్న చంద్రుడు.. తీర నగరాలకు ముంపు ముప్పు: నాసా

వాషింగ్టన్, జులై 16:: అస్థిరంగా కదులుతున్న చంద్రుడితో భూమిపై ఉన్న తీర నగరాలకు ముంపు ముప్పు తప్పదని అమెరికన్ స్పేస్ ఏజెన్సీ నాసా తాజా అధ్యయనంలో వెల్లడైంది. పర్యావరణ మార్పులతోపాటు చంద్రుడి ఈ అస్థిర చలనం కారణంగా సముద్ర మట్టాలు పెరుగుతాయని నాసా పరిశోధకులు వెల్లడించారు. 2030వ దశకం మధ్యలో అమెరికాలోని తీరప్రాంత నగరాలు ముంపుకు గురవుతాయని వాళ్లు స్పష్టం చేశారు. ఇప్పటికే అధిక ఆటుపోట్ల కారణంగా కొన్ని నగరాలు వరదల్లో చిక్కుకున్నాయని తెలిపారు. నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్పియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఓఏఏ) 2019లోనే ఇలాంటి 600 వరదలను రిపోర్ట్ చేసిన విషయాన్ని నాసా గుర్తు చేస్తోంది.

ఈ అధ్యయనం తాలూకు ఫలితాలను నేచర్ క్లైమేట్ చేంజ్ జర్నల్‌లో ప్రచురించారు. వరదల వెనుక ఉన్న ఖగోళ కారణాలను విశ్లేషించడంపైనే ఈ అధ్యయనం ప్రధానంగా దృష్టి సారించింది. దీని గురించి నాసా అడ్మినిస్ట్రేటర్ బిల్ నెల్సన్ వివరించారు. చంద్రుడి గురుత్వాకర్షణ శక్తి, సముద్ర మట్టాలు పెరగడం, పర్యావరణంలో వస్తున్న మార్పులు ప్రపంచంలోని తీర ప్రాంతాల్లో వరదల ముప్పును పెంచుతున్నాయి. దీనికి సంబంధించి నాసా సీ లెవల్ చేంజ్ టీమ్ కీలకమైన సమాచారాన్ని అందిస్తోంది. ఈ సమాచారంతో మనం వరదల కారణంగా పర్యావరణం, ప్రజల జీవనోపాధులు ప్రభావితం కాకుండా తగిన చర్యలు తీసుకోగలం అని నెల్సన్ చెప్పారు.

చంద్రుడు వణకడం లేదా అస్థిరంగా కదలడం అనేది కొత్త విషయం ఏమీ కాదని కూడా నాసా స్పష్టం చేసింది. 1728లోనే తొలిసారి ఇది కనిపించింది. అయితే ఇందులో కొత్త విషయం ఏమిటంటే.. చంద్రుడి అస్థిర చలనం దాని గురుత్వాకర్షణ శక్తిపై చూపే ప్రభావం, పర్యావరణ మార్పుల కారణంగా సముద్ర మట్టాలు పెరిగిపోతుండటంతో కలిసి ఎలాంటి ప్రభావం చూపబోతుందన్నదే ఇక్కడ ముఖ్యమైన అంశం.

చంద్రుడి కక్ష్యలో ఈ అస్థిర చలనం పూర్తి కావడానికి 18.6 ఏళ్లు పడుతుంది. ఇందులో తొలి భాగంలో భూమిపై ఆటుపోట్లు తక్కువగా ఉండి, రెండో భాగంలో ఒక్కసారిగా పెరుగుతాయి. ఆ లెక్కన 2030వ దశకంలో మధ్యలో ఆటుపోట్లు పెరిగి ఇప్పటికే సముద్ర మట్టాలు పెరగడం వల్ల అతలాకుతలం అవుతున్న తీర నగరాలను పూర్తిగా ముంచేసే ప్రమాదం ఉన్నదని నాసా పరిశోధకులు చెప్పారు.

టూ వీలర్స్ కు అద్దాలు తప్పనిసరి : మద్రాస్ హైకోర్టు

చెన్నై, జూలై, జులై 16::ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా రెండు వైపులా అద్దాలు అమర్చాలని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. ఈ నిబంధనను కఠినంగా అమలు చేయాలని తమిళనాడు రాష్ట్ర రవాణా కమిషనర్, పోలీసు కమిషనర్ లకు చీఫ్ జస్టిస్ సంజీవ్ బెనర్జీ, జస్టిస్సెంథిల్ కుమార్ రామమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. ద్విచక్ర వాహనాల అద్దాలను తొలగిస్తే వాహన వారంటీ రద్దు అవుతుందని వినియోగదారులను హెచ్చరించాలని వాహన తయారీదారులకు తెలియజేయాలని సంబంధిత అధికారులకు సూచించింది.

ద్విచక్ర వాహనానికి మిర్రర్స్ లేకపోతే మలుపుల వద్ద వచ్చే వాహనాలను గమనించలేకపోవడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతాయని మద్రాస్ కోర్టు అభిప్రాయపడింది. తిరుచెందూర్‌కు చెందిన న్యాయవాది రామ్‌కుమార్ ఆదిత్యన్ వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పీఐఎల్)పై తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేస్తూ ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది.

కొంత మంది వాహనదారులు స్టైల్ కోసమో లేదంటే, ఇతర కారణంతోనే ద్విచక్ర వాహనాలకున్న మిర్రర్స్ తొలగిస్తారు. ఈ విధంగా చేయడం వల్ల స్టైల్ గా ఉడొచ్చేమో కానీ, వెనుక వచ్చే వాహనాలను గుర్తించలేరు కావున ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది. ఈ సమస్యకు పరిష్కారం కోరుతూ న్యాయవాది రామ్‌కుమార్ ఆదిత్యన్ మద్రాస్ హైకోర్టులో కేసు వేశారు. ద్విచక్ర వాహనాలపై మిర్రర్స్ తొలగించడం వల్ల మరిన్ని ప్రమాదాలు సంభవించాయని ఆయన ఆరోపించారు. అద్దాలను తొలగించే వారికి జరిమానా విధించాలని ఆయన అభ్యర్థించారు.

కేసీఆర్ విముక్త్ తెలంగాణ కావాలి

– ఎస్ సి మోర్చా సమావేశంలో జాతీయ అధ్యక్షుడు లాల్ సింగ్ ఆర్య

రాజన్న సిరిసిల్ల, జులై 16: (నేటినిజం ప్రతినిధి): దళితుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తున్న కేసిఆర్ చేతి నుండి తెలంగాణా రాష్ట్రం విముక్తి జరిగితేనే దళితుల జీవితాలు బాగుపడతాయని బిజెపి జాతీయ అధ్యక్షుడు లాల్ సింగ్ ఆర్య అన్నారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణంలో జాతీయ, రాష్ట్ర స్థాయి యస్ సి మోర్చా సమావేశాల్లో భాగంగా జాతీయ అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి శంభునాథ్ షుండియా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర బిజెపి యస్ సి మోర్చా అధ్యక్షులు కొప్పు భాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా దళితున్ని చేస్తానని మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కేసిఆర్ దళితులను మోసం చేస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. దేశంలో 60 ఏళ్ళు పాలించిన కాంగ్రెస్ పార్టీ అప్పులపాలు చేసారని గుర్తు చేశారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో ఇంటింటికీ 30 కోట్లకు పైగా గ్యాస్ ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే జన్ ధన్ ఖాతాలు ఇచ్చి ప్రతి పేదవారికి ఇన్యురెన్స్ ఇస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లో కేసిఆర్ ను గద్దె దించడమే లక్ష్యంగా బిజెపి పార్టీ పనిచేస్తుందని పేర్కొన్నారు. తదనంతరం తెలంగాణ రాష్ట్ర బిజెపి పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కేసిఆర్ కుటుంబం కోసమే వచ్చిందని ఎద్దేవా చేశారు. ఇంటికొక ఉద్యోగం అని చెప్పి తన ఇంట్లో అందరికీ ఉద్యోగాలు ఇచ్చుకున్నాడని అన్నారు. 2023లో తెలంగాణ రాష్ట్రం లో బిజెపి అధికారంలోకి తేవడమే లక్ష్యంగా ప్రతి సభ్యుడు పనిచేయాలని సూచించారు. అనంతరం వేములవాడ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లాల యస్ సి మోర్చా అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, రేగుల మల్లికార్జున్, పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాజ్ భవన్ గేటుకు కాంగ్రెస్ జెండాలు!

హైదరాబాద్ , జులై 16:కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన 'చలో రాజ్ భవన్' నిరసన కార్యక్రమం ఉద్రిక్తతలకు దారితీసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాజ్‌భవన్ వద్ద టెన్షన్ వాతావరణం నెలకొంది. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ చలో రాజ్ భవన్ కార్యక్రమానికి పిలుపునివ్వడంతో రాజ్‌భవన్ వద్ద భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. రాజ్ భవన్ వైపు కాంగ్రెస్ శ్రేణులు దూసుకురాకుండా బారికేడ్లు, ఇనుప ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే కాంగ్రెస్ కార్యకర్తలు కొంతమంది రాజ్?భవన్ దగ్గరకు వచ్చేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరు కాంగ్రెస్ కార్యకర్తలు రాజ్‌భవన్ వైపు దూసుకొచ్చారు. పోలీసులను తప్పించుకుని కాంగ్రెస్? జెండాలతో రాజ్‌భవన్ గేటు వద్దకు చేరుకున్నారు. తమతో పాటు తెచ్చుకున్న కాంగ్రెస్? పార్టీ జెండాలను రాజ్?భవన్? గేటుకు కట్టి నినాదాలు చేశారు.

మరోవైపు ఇందిరా పార్క్ ధర్నా చౌక్?కు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇప్పటికే ఇందిరా పార్క్ వద్దకు చేరుకున్నారు. ఇందిరా పార్కు నుంచి రాజ్?భవన్?కు ర్యాలీగా వెళ్లి గవర్నర్?కు వినతిపత్రం ఇవ్వాలని కాంగ్రెస్ భావించినప్పటికీ.. పోలీసులు ర్యాలీకి అనుమతి ఇవ్వలేదు. ధర్నా చౌక్ వద్ద మధ్యాహ్నం రెండు గంటల వరకు కేవలం 200 మందితో సమావేశానికి మాత్రమే అనుమతి ఇచ్చారు. కాంగ్రెస్ శ్రేణులు రాజ్ భవన్‌కు వెళ్లకుండా ఇందిరా పార్క్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు. మరోవైపు జిల్లాల్లో కాంగ్రెస్? నాయకులను, కార్యకర్తలను పోలీసులు గృహనిర్బంధం చేస్తున్నారు. ఎక్కడికక్కడ అరెస్టులు చేస్తున్నారు.

భాగ్యనగరమా మేలుకో? మళ్లీ సేమ్ సీన్

హైదరాబాద్ , జులై 16:హైదరాబాద్ నగరంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు నగరవాసులను అతలాకుతలం చేస్తున్నాయి. నగరంలో ఎక్కడ చూసినా మునిగిన కాలనీలు.. నీటితో నిండిన ఇళ్లు, ఉప్పొంగిన డ్రైనేజీలు.. చెరువులను తలపిస్తున్న రోడ్లు దర్శనమిస్తున్నాయి. హైదరాబాద్‌లో గతేడాది వరదలు వచ్చినప్పటి పరిస్థితే ఇప్పుడు మళ్లీ కనిస్తోంది. నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు దాదాపు 250పైగా కాలనీలు నీట మునిగాయి. చాలా చోట్ల ఇప్పటికే ఇళ్లు వరద నీటిలోనే ఉన్నాయి. దీంతో ప్రజలు ఇంట్లో ఉండే పరిస్థితి లేకుండా పోయింది. ఒక్కసారిగా ఇండ్లలోకి నీరు రావడంతో కట్టుబట్టలతో కొందరు బయటకు వెళ్లిపోయారు. మరికొందరు తమ ఇళ్లపైకి ఎక్కి రాత్రంతా భయం భయంగా గడిపారు.

గతేడాది వరదలు హైరాబాద్ నగరాన్ని ఏస్థాయిలో వణించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా వరదలు భాగ్యనగరాన్ని ముంచెత్తాయి. ఈసారి కూడా వరదలు అదే స్థాయిలో ఉంటున్నాయి. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ రెడ్? అలర్ట్? ప్రకటించడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

హైదరాబాద్ పరిధిలో చెరువులు నిండి పొంగిపొర్లాయి. దీంతో కాలనీల్లోకి వరద ఉప్పొంగింది. గతేడాది అక్టోబర్‌లో మాదిరే ఇప్పుడూ జనం ఇబ్బందులు పడ్డారు. ఎల్బీనగర్, అబ్దుల్లాపూర్?మెట్, సరూర్ నగర్, హయత్ నగర్, ఉప్పల్, నాగోల్, బండ్లగూడ జాగీర్, మల్కాజిగిరి, బేగంపేట్, టోలిచౌకి, అత్తపూర్ తదితర ప్రాంతాల్లోని కాలనీల్లో ఇళ్లు మునిగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఇండ్లలోనే ఉండిపోవడంతో జీహెచ్ఎంసీ సిబ్బంది బోట్ల ద్వారా సహాయక చర్యలను చేపట్టారు. ఫుడ్ ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్లను అందించారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జీహెచ్ఎంసీ సహాయక చర్యలు ఆలస్యం కావడంతో జనం చాలా ఇక్కట్లు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ ఎలాంటి సహాయక చర్యలు ప్రారంభించలేదు. దీంతో నగరవాసులకు ఇక్కట్లు తప్పడం లేదు.

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని పరామర్శించిన మంత్రి హరీశ్‌రావు

వరంగల్ రూరల్, జులై 16:: నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు పరామర్శించారు.

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తండ్రి రాజిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, శుక్రవారం నల్లబెల్లి మండల కేంద్రంలో రాజిరెడ్డి చిత్రపటానికి మంత్రి పూల మాలలు వేసి నివాళులు అర్పి ంచారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థించారు.

వారి కుటు ంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి వెంట టీఆర్ఎస్ నేతలు, తదితరులు ఉన్నారు.

ఆయుర్వేదలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ టీచింగ్ అండ్ రీసెర్చ్ (ఐటిఆర్ఎ), గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం

న్యూఢిల్లీ, జులై 16:ఆయుష్ మంత్రిత్వ శాఖ కింద జామ్‌నగర్ లో ఉన్న ఆయుర్వేద ఇన్స్టిట్యూట్ ఆఫ్ టీచింగ్ అండ్ రీసెర్చ్ (ఐటిఆర్ఎ)కి గుజరాత్ ప్రభుత్వానికి మధ్య గుజరాత్ ఉప ముఖ్యమంత్రి శ్రీ నితిన్‌భాయ్ పటేల్, ఆయుష్వైద్య కార్యదర్శి రాజేష్ కోటేచా సమక్షంలో 2021 జులై 15వ తేదీన అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ అవగాహన ఒప్పందం ద్వారా జామ్‌నగర్‌లోని ఆయుర్వేద క్యాంపస్‌లో పనిచేస్తున్న అన్ని సంస్థలను ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఏకైక సంస్థ ఐటిఆర్ఎ గొడుగు కిందకు తీసుకువచ్చారు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ (ఐఎన్ఐ) హోదా పొందారు. అవగాహన ఒప్పందం ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన శ్రీనితిన్‌భాయ్, ఇది ఆయుర్వేదంలోని అన్ని శాఖలలో విద్యావ్యవస్థను బలోపేతం చేయడానికి మార్గం సుగమం చేస్తుందని అన్నారు.

డైరెక్టర్, ఐటిఆర్ఎ, ప్రొఫెసర్ డాక్టర్ అనుప్ ఠాకర్, గుజరాత్ ఆయుర్వేద విశ్వవిద్యాలయం ఇంచార్జి రిజిస్ట్రార్ శ్రీ హెచ్.పి.ఝుల ఈ అవగాహన ఒప్పందం ఇచ్చి పుచ్చుకున్నారు.

"ఈ ఏర్పాటు విద్య, పరిశోధన మరియు వైద్య రంగాలలో కొత్త తలుపులు తెరవడానికి కారణం అవుతుంది" అని ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి చెప్పారు. ఆయుర్వేద రంగంలో, కొత్త బోధన, వైద్య మరియు పరిశోధనా పద్ధతులను సిద్ధం చేయడం సులభం అవుతుందని, అధ్యయనం–పరిశోధన ప్రక్రియ వేగవంతం అవుతుందని అయన తెలిపారు. ఆయుర్వేద విద్య, పరిశోధన మొత్తం పరిధిని విస్తరిస్తుందని భావిస్తున్నట్టు చెప్పారు.

వైద్య రాజేష్ కోటేచా మాట్లాడుతూ ఆయుర్వేద రంగంలో కొత్త బోధన, వైద్య, పరిశోధన పద్ధతులను సిద్ధం చేయడం సులభం అవుతుంది. అధ్యయనం, పరిశోధన ప్రక్రియను మరింత లోతుగా చేయవచ్చని, ఆయుర్వేద విద్యకు, దేశవ్యాప్తంగా పరిశోధనా సంస్థలను పునః రూపకల్పన చేయడానికి ఐటిఆర్ఎ ఒక ఆదర్శవంతమైన సంస్థగా ఉంటుందని ఆయన అన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి, జులై 16:: పేద ప్రజలను ప్రభుత్వం ఎల్లప్పుడూ ఆదుకుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం వనపర్తిలోని తన నివాసంలో లబ్ధిదారులకు రూ.11.91 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరంగా మారిందన్నారు. ఆపత్కాలంలో ఎంతోమంది నిరుపదలకు ఆసరగా నిలుస్తుందన్నారు.

రాంమ్మూర్తి కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సత్యవతి

ములుగు, జులై 16: మేడారం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఆలం రాంమ్మూర్తి ఇటీవల గుండె పోటుతో ఆకస్మికంగా మరణించిన విషయం తెలిసిందే. కాగా, శుక్రవారం గిరిజన సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ మేడారంలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాంమ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. మంత్రి వెంట ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్, తదితరులు ఉన్నారు.

యాదాద్రి ఆలయం అత్యద్భుతం : ఏపీ మంత్రి పేర్ని నాని

యాదాద్రి భువనగిరి, జులై 16: : యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం అత్యద్భుతమని ఏపీ మంత్రి పేర్ని నాని అన్నారు. శుక్రవారం యాదాద్రి లక్ష్మీ నర్సింహ స్వామిని మంత్రి దర్శించుకుని ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..స్వామి వారి ఆలయాన్ని చాలా చిత్తశుద్ధితో పూర్తి సాంప్రదాయంగా, ప్రపంచవ్యాప్తంగా భక్తులకు నచ్చేలా నిర్మించడం చాలా గొప్ప విషయమన్నారు. తిరుపతి ఆలయాన్ని శ్రీకృష్ణదేవరాయలు నిర్మించడం ప్రస్తుతం చరిత్రగా చెప్పుకుంటున్నారని.. భవిష్యత్తులో యాదాద్రి ఆలయాన్ని కేసీఆర్ నిర్మించారని చెప్పుకుంటారని పేర్కొన్నారు. దేవుడి ఆశీస్సులతో సీఎం కేసీఆర్ సంకల్పం తప్పకుండా నెరవేరుతుందని మంత్రి పేర్కొన్నారు.

పేదలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

మహబూబ్‌నగర్, జులై 16:రాష్ట్రంలో ఉన్న పేదలను అభివృద్ధి చేయడమే టీఆర్ఎస్ ప్రభుత్ లక్ష్యమని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం నెల్లికుదురు మండలంలోని టీఆర్ఎస్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పేదరిక నిర్మూలన కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా రైతు కో ఆర్డినేటర్ బాలాజీ నాయక్, జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ మాధవి, వైస్ ఎంపీపీ వెంకటేష్, పరిపాటి వెంకట్ రెడ్డి, బిక్కు నాయక్, లక్ష్మా రెడ్డి, గుండా వెంకన్న, భీముడు, శ్రీనివాస్, విజయ్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని పరిరక్షించుకుందాం - పదికాలాల పాటు ఆరోగ్యంగా జీవిద్దాం - ఉపరాష్ట్రపతి ఆకాంక్ష

-ప్రకృతి పరిరక్షణను, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలి.
-ప్రకృతి పరిరక్షణ ప్రజా ఉద్యమంగా రూపుదాల్చాలి
-ఇందుకోసం యువతరం చొరవ తీసుకుని భావితరాలకు ఆదర్శనీయం కావాలి.
-జీవన విధానంలో ప్రతికూల మార్పుల కారణంగా కొత్త వ్యాధులు ముప్పిరిగొంటున్నాయి
-ప్రకృతితో కలిసి జీవించడం ద్వారా అనేక సమస్యలను దూరం చేసుకోవచ్చు.
-నవభారత నిర్మాణంలో యువత నైపుణ్యాభివృద్ధి కీలకం
- నాలుగో పారిశ్రామికీకరణ నేపథ్యంలో నూతన నైపుణ్యాలతో యువత సిద్ధం కావాలి
-హైదరాబాద్ స్వర్ణభారత్ ట్రస్ట్ శిక్షణార్థులతో ఉపరాష్ట్రపతి మాటామంతీ

హైదరాబాద్ , జులై 16:ప్రకృతి పరిరక్షణ ప్రజాఉద్యమంగా రూపుదాల్చాల్సిన అవసరం ఉందని భారత గౌరవ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు ఆకాంక్షించారు. ప్రకృతి పరిరక్షణను, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ఆరోగ్యకరమైన భవిష్యత్ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ఈ శుక్రవారం హైదరాబాద్ ముచ్చింతల్ స్వర్ణభారత్ ట్రస్ట్ లో కొనసాగుతున్న వివిధ శిక్షణా కార్యక్రమాలను పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించిన ఆయన, నాలుగో పారిశ్రామికీకరణ నేపథ్యంలో అవసరమైన నూతన నైపుణ్యాలతో యువత తమను తాము తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు. అంతకు ముందు స్వర్ణ భారత్ ట్రస్ట్ ప్రాంగణంలో మొక్కను నాటారు.

భవిష్యత్ భారత నిర్మాణంలో యువత పాత్ర ఎంతో కీలకమన్న ఉపరాష్ట్రపతి, నైపుణ్యం కలిగి ఉన్న యువతరమే నవ్యభారతాన్ని సమగ్రంగా నిర్మించగలరని అభిలషించారు.

ఇందు కోసమే స్వర్ణభారత్ ట్రస్ట్ లో నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామన్న ఆయన, స్వర్ణభారత్ ట్రస్ట్ చేపడుతున్న కార్యక్రమాల వెనుక తమ మిత్రుల సహకారం ఎంతో ఉందని, వారందరికీ అభినందనలు తెలియజేశారు.

ఫలితాన్ని పొందడానికి ఎంత శ్రద్ధాసక్తులు చూపిస్తారో, ఆ ఫలితాన్ని పొందడానికి ఉపయోగించే పద్ధతుల విషయంలో కూడా అంతే శ్రద్ధను చూపించాలన్న వివేకానందుని సూక్తిని ఉటంకించిన ఉపరాష్ట్రపతి, శ్రద్ధాసక్తులే భవిష్యత్ జీవితాన్ని నిర్దేశిస్తాయని, అందుకే ఇష్టపడి, కష్టపడితే నష్టపోయేది లేదని తెలిపారు. రోజురోజుకీ పెరుగుతున్న శాస్త్రసాంకేతిక ప్రగతి అన్ని రకాల వృత్తి వర్గాల నుంచి నైపుణ్యాన్ని ఆశిస్తోందన్న ఆయన, ఈ పరిస్థితుల్లో ఆర్థికరంగం పాతతరహాలో మనుగడ సాగించలేని స్థితి వచ్చిందని తెలిపారు.

గత మూడు పారిశ్రామిక విప్లవాల్లో ఉన్న నైపుణ్యాలు నాలుగో పారిశ్రామిక విప్లవంలో పూర్తిగా మారుతాయన్న గ్లోబల్ బిజినెస్ కో ఎవల్యూషన్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ నివేదిక గురించి ప్రస్తావించిన ఉపరాష్ట్రపతి, కేంద్రప్రభుత్వం ప్రకటించిన నూతన విద్యావిధానంలో నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీట వేశారని, స్కిల్ ఇండియా లాంటి పథకాలు సైతం ఈ బాధ్యతను తలకెత్తుకున్నాయని తెలిపారు. ప్రభుత్వ చేస్తున్న కార్యక్రమాలు మాత్రమే సరిపోవన్న ఆయన, విధాన నిర్ణేతలు, ఆర్థిక నిపుణులు, రాజకీయ నాయకులు దేశ భవిష్యత్ కోసం యువతను నైపుణ్యం వైపు నడిపించాలని, అదే సమయంలో పరిశ్రమలు సైతం తమకు కావలసిన నైపుణ్యాలతో యువతను తీర్చిదిద్దాలని సూచించారు.

గత కొన్నేళ్ళుగా సునామీలు, భూకంపాలు, కొండచరియలు విరిగిపడడం లాంటి ఎన్నో ప్రకృతి విపత్తులను చూస్తున్నామన్న ఉపరాష్ట్రపతి, భూతాపం పెరిగిపోవడం, అడవుల్లో కార్చిచ్చులు, తీవ్రమైన కరువులు, వడగాలులు, తుఫానులు, వరదలు, అకాల వర్షాలు, మంచు పర్వతాలు కరగడంతో పాటు సముద్ర మట్టాలు పెరగడం వంటి పర్యావరణ విపత్కర మార్పులను ప్రస్తావించారు.

అడవుల నరికివేత కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందన్న ఆయన, వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువుల పరిమాణం పెరుగుతోందని తెలిపారు. చెరువులు, నదులు వంటి వాటిని ఆక్రమించుకోవడం కారణంగా వరదల ద్వారా ప్రకృతి ప్రకోపాన్ని మనం అనుభవిస్తున్నామని పేర్కొన్న ఉపరాష్ట్రపతి, మానవ తప్పిదాల కారణంగానే భూతాపం పెరుగుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని, అభివృద్ధి చెందే క్రమంలో పర్యావరణాన్ని కూడా కాపాడుకోవాలనే విషయాన్ని కూడా అర్థం చేసుకోవాలని సూచించారు.

గ్రామ పంచాయతీల నుంచి పార్లమెంటు వరకు ప్రతి ఒక్కరూ ప్రకృతి పరిరక్షణలో భాగస్వామ్యం వహించాలన్న ఉపరాష్ట్రపతి, పర్యావరణ కాలుష్యానికి పాల్పడుతున్న వారిపైనా కఠినంగా వ్యవహరించాల్సిందేనన్నారు.

కార్పొరేట్ సంస్థలు తమ సి.ఎస్.ఆర్. నిధుల్లో ఒక వాటాను పూర్తిగా పర్యావరణ పరిరక్షణ కోసం కేటాయించాలన్న ఆయన, ఇందు కోసం ఎన్జీవోలు చొరవ తీసుకుని పాఠశాల స్థాయి నుంచే పర్యావరణ స్పృహ కల్పించే దిశగా కృషి జరగాలన్నారు. మానవుడికి, ప్రకృతికి మధ్య పరస్పర ఆధారిత వ్యవస్థ ఆవశ్యకతను కరోనా మహమ్మారి మనకు మరోసారి గుర్తు చేసిందన్న ఉపరాష్ట్రపతి, భూమిపై ఉన్న జీవజాతితో కలిసి జీవించడం ద్వారానే మానవజాతి మనుగడ సాధ్యమైందని తెలిపారు.

మనం చేసే పనికి మన భవిష్యత్ తరాలు బాధపడకూడదనే పర్యావరణ స్పృహ మనకుండాలని దిశానిర్దేశం చేసిన ఉపరాష్ట్రపతి, పర్యావరణ పరిరక్షణకు మనమంతా ట్రస్టీలుగా ఉండాలన్న జాతిపిత గాంధీజీ మాటలను గుర్తు చేశారు. ఈ దిశగా చారిత్రకమైన 'పారిస్ ఒప్పందాన్ని' తీసుకురావడంలో భారతదేశం కీలక భూమిక పోషించిందన్న ఆయన, అంతర్జాతీయ సౌరకూటమి ఏర్పాటులో మన దేశం కీలక పాత్ర పోషించిందని, ఈ దిశగా చొరవ తీసుకున్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ అభినందనీయులని పేర్కొన్నారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణలో యువత పాత్ర కీలకమన్న ఉపరాష్ట్రపతి, భావితరాలకు ఆదర్శంగా ప్రకృతిని సంరక్షించుకుంటూ, నవభారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

పర్యావరణానికి మనం దూరమౌతూ వస్తున్న నేపథ్యంలో ముప్పిరిగొంటున్న వ్యాధుల గురించి ప్రస్తావించిన ఉపరాష్ట్రపతి, 21వ శతాబ్దంలో దగ్గరున్న వస్తువులను మాత్రమే చూడగలిగే మయోపియా వ్యాప్తి పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు మాటల సందర్భంలో ఈ వ్యాధి గురించి తెలిపారని, 2050 నాటికి సగం ప్రపంచ జనాభా ఈ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉందన్న వైద్యుల హెచ్చరికల నేపథ్యంలో నాలుగు గోడల మధ్య జీవన విధానానికి స్వస్తి చెప్పి, ప్రకృతికి మరింత దగ్గర కావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు శ్రీ జి.ఎన్.రావు, ఆస్పత్రి భావి ఛైర్మన్ డా. ప్రశాంత్ గర్గ్, స్వర్ణభారత్ ట్రస్ట్ అధ్యక్షులు శ్రీ చిగురుపాటి కృష్ణ ప్రసాద్, కార్యదర్శి శ్రీ సుబ్బారెడ్డి, మల్లారెడ్డి విద్యాసంస్థల కోశాధికారి శ్రీ భద్రారెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కరోనా ఎఫెక్ట్ : ఈద్గాల వద్ద ప్రార్థనలు నిషేధిస్తూ ఏపీ సర్కార్ ఉత్తర్వులు

అమరావతి, జులై 16: కరోనా ప్రభావం పండుగలు, పర్వదినాలపైనా పడుతున్నది. ఈ నెల 20 లేదా 21న బక్రీద్ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రార్థనలు నిషేధిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇవాళ ఉత్తర్వులు జారీ చేసింది. ఈద్గాలు, ఆరుబయట ప్రార్థనలకు అనుమతి లేదని ఉత్తర్వుల్లో పేర్కొంది. 50 శాతం మందితో భౌతికదూరం నిబంధన పాటిస్తూ మసీదుల్లోనే ప్రార్థనలు నిర్వహించుకోవాలని సూచించింది. ప్రార్థన సమయంలో ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని, మాస్కులు ధరించని వారిని మసీదుల్లోకి అనుమతించొద్దని ఇమామ్, మౌజమ్‌లను ఆదేశించింది. జ్వరం, జలుబు, దగ్గు తదితర లక్షణాలు ఉన్న భక్తులు ఇంట్లోనే ప్రార్థనలు నిర్వహించుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. షుగర్, హైబీపీ, హృద్రోగ సమస్యలతో బాధపడుతున్న వారికి ఇవే నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది. పండుగ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనాలు, ప్రత్యేక కార్యక్రమాలు, కరచాలనాలు, ఆలింగనాలను నిర్వహించొద్దని ప్రభుత్వం ముస్లిం మత పెద్దలను కోరింది.

శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ప్రారంభమైన పుష్ప మహాయాగం

తిరుపతి, జులై 16: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం కనకాంబర సహిత కోటి మల్లెపుష్ప మహాయాగం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఈ యాగం జూలై 24వ తేదీ వరకు ఆన్‌లైన్ వర్చువల్ విధానంలో జరుగనున్నది. కరోనా కారణంగా ప్రపంచ మానవాళికి తలెత్తిన ఆర్థిక ఇబ్బందులను తొలగించాలని శ్రీ మహాలక్ష్మి అవతారమైన శ్రీ పద్మావతి అమ్మవారిని ప్రార్థిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం ఈ మహాయాగం నిర్వహిస్తోంది.

ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి, మూల వర్లకు అభిషేకం నిర్వహించారు. అనంతరం సహస్రనామార్చన, నిత్యార్చన జరిగింది. ఉదయం 8.30 గంటలకు ఆలయంలోని శ్రీ కృష్ణస్వామి ముఖ మండపంలో అమ్మవారిని వేంచేపు చేశారు. ఇందులో భాగంగా సంకల్పం, కుంభ అవాహన, అగ్ని ప్రతిష్ట, చతుష్టార్చన, కోటి కుంకుమార్చనలో ఒక ఆవర్తి, హోమం, లఘుపూర్ణాహుతి నిర్వహించారు.

టీటీడీ పాంచరాత్ర ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో 400 కిలోల పుష్పాలతో అమ్మవారిని అర్చించనున్నారు. ఇందులో ఒక్కపూటకు 40 కిలోల కనకాంబరాలు, 120 కిలోల మల్లెపూలు, 40 కిలోల ఇతర సాంప్రదాయ పుష్పాలు ఉన్నాయి. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన180 మంది ప్రముఖ ఋత్వికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏపీలో కొత్తగా 2,345 కరోనా కేసులు, 16 మంది మృతి

అమరావతి, జులై 16: ఆంధ్రప్రదేశ్‌లో కరోనా ఉధృతి కొనసాగుతూనే ఉంది. గడిచిన 24 గంటల వ్యవధిలో కొత్తగా 2,345 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వైరస్ బారినపడిన వారిలో 3 వేల మంది కోలుకున్నారు.

16 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం కొవిడ్ పాజిటివ్ కేసులు 1,93,4450కి పెరిగాయి.

ఇవాళ్టి వరకు 1,89,6499 మంది కోలుకున్నారు. ఇంకా 24,854 యాక్టివ్ కేసులున్నాయి. మొత్తం మరణాలు 13,097కు చేరాయి. ఇవాళ 81,740

ప్రశ్నించే గొంతుకలను పోలీసులు నిర్బంధించలేరు-టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, జులై 16: (నేటినిజం ప్రతినిధి): ప్రజల పక్షాన ప్రభుత్వాలను ప్రశ్నించే గొంతుకలను అక్రమ అరెస్టులతో పోలీసులు నిర్బంధించలేరని,తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఆది శ్రీనివాస్ అన్నారు.

పెంచిన పెట్రోల్, డీజిల్ ,వంట గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీశుక్రవారం ఇచ్చిన పిలుపుమేరకు చలో రాజ్ భవన్ కార్యక్రమానికి తరలి వెళుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తుగా అక్రమ అరెస్టులు చేయడం శోచనీయమని ఈ అక్రమ అరెస్టులను ప్రజా సౌమ్యవాదులు ఖండించాలని ఆది శ్రీనివాస్ కోరారు.

శుక్రవారం వేములవాడ ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి రోజు డీజిల్ ,పెట్రోల్ ధరలను పెంచుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజల నడ్డివిరుస్తున్నాయన్నారు. నిజానికి పెట్రోల్ మరియు డీజిల్ రూపాయలు 11.40 పైసలకే ప్రజలకు అందించవచ్చునని కేంద్ర పన్ను రూపాయలు 33శాతం రాష్ట్ర పన్ను రూపాయలు 11.32 శాతం వేయడం వల్లనే పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయని బండ శంకర్ అన్నారు.

రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ పెట్రోల్, డీజిల్ మరియు వంట గ్యాస్ ధరలను తగ్గించే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఉధృతం చేస్తుందని ఆది శ్రీనివాస్ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సంగ స్వామియాదవ్,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్,నాయకులు చిలుక రమేష్,నాగుల విష్ణుప్రసాద్, కూరగాయల కొమురయ్య అరుణ్ తేజ చారి ,కనికరపు రాకేశ్ తోట రాజేష్ వనపర్తి శంకర్ మర్రి పల్ల రాజు,నాగుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ప్రజా పోరాటాలను ఆపలేరు

కోనరావుపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా

రాజన్న సిరిసిల్ల, జులై 16: (నేటినిజం ప్రతినిధి): పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని టిపిసిసి పిలుపు మేరకు కాంగ్రెస్ పీసీసీ కార్యదర్శి ఆదిశ్రీనివాస్ ఆదేశాల మేరకు శుక్రవారం తలపెట్టిన చలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని నిర్వీర్యం చేస్తూ ముందస్తుగా అరెస్టులను ఖండించిన కోనరావుపేట మండల అధ్యక్షులు షేక్ ఫిరోజ్ పాషా మాట్లాడుతూ గత కాంగ్రెస్ హయాంలో పెట్రోల్ 54రూపాయలు గ్యాస్ 1000 రూపాయలు కి పైగా పేదల పైన మోపిన నరేంద్రమోడీకి కేసీఆర్ ప్రజలే గుణపాఠం చెప్పడం ఖాయమని అని అన్నారు.

పోలీసు పహారాలో కెసిఆర్ ప్రభుత్వం ఎన్ని రోజులు రాజ్యమేలుతారో చూద్దాం ఇటువంటి అరెస్టులకు బెదరకుండా కాంగ్రెస్ కార్యకర్తలు ముందుండి ప్రజల కోసం కాంగ్రెస్ కార్యకర్తలు పని చేస్తారు.

ప్రశ్నించే గొంతుకలను ఎంత నిర్బంధించిన కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై పోరాడుతు ందని అన్నారు.

ఇలాంటి అరెస్టును తీవ్రం గా ఖండిస్తున్నాం అని అన్నారు .

ఈ కార్యక్ర మంలో మండల నాయకులు బోయిన దేవరాజు గడి పెల్లి ఎల్లయ్య యాదవ్ తదితరులు ఉన్నారు .

గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా రంగాల్లో భారత్ ముందడుగు- శ్రీ ఆర్ కె సింగ్

న్యూఢిల్లీ, జులై 16భ్ర్ భరత్-పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో స్వయం సమృద్ధి అనే అంశంపై భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ప్రసంగించారు. ప్రపంచంలో పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని అత్యంత వేగంగా అభివృద్ధి చేసుకుంటున్న దేశంగా భారతదేశం గుర్తింపు పొందిందని ఆయన చెప్పారు.

పారిస్ లో జరిగిన కాప్-21 సమావేశంలో అంగీకరించిన విధంగా 2030 నాటికి విద్యుత్ ఉత్పత్తిలో 40% ఉత్పత్తిని శిలాజ రహిత ఇంధన వనరులను వినియోగించి చేయాలన్న ఒప్పందానికి భారత్ కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ఇప్పటికే 38.5% విద్యుత్ ను శిలాజ రహిత ఇంధన వనరులను వినియోగించి చేస్తున్నామని, సామర్థ్య పెంపుదలకు అమలు చేస్తున్న పథకాలను పరిగణనలోకి తీసుకుంటే ఇది 48. 5%గా ఉంటుందని మంత్రి వివరించారు. 2030 నాటికి పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని 450 గెగా వాట్లకి పెంచి ఈ రంగంలో ప్రపంచంలో అగ్రగామిగా కొనసాగాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని శ్రీ సింగ్ అన్నారు.

దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన పథకం కింద ప్రతి గ్రామాన్ని, ప్రతి కుగ్రామాన్ని అనుసంధానించామని,, సౌభాగ్య పథకం కింద ప్రతి ఇంటిని అనుసంధానించడం ద్వారా భారతదేశం అందరికి విద్యుత్ అందించడంలో విజయం సాధించిందని మంత్రి పేర్కొన్నారు.

ప్రపంచంలో అత్యంత వేగంగా సాగిన అతి భారీ పథకం ఇదేనని మంత్రి వివరించారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని అన్నారు.

కోవిడ్-19 ప్రభావం ఉన్నప్పటికీ దేశంలో విధ్యుత్ డిమాండ్ 200 గెగా వాట్లకు చేరుకున్నదని శ్రీ సింగ్ తెలిపారు. కోవిడ్ ప్రభావం లేని సమయంలో కూడా విద్యుత్ కు ఇంత డిమాండ్ లేదని వివరించిన మంత్రి ఈ డిమాండ్ మరింత పెరుగుతుందని భావిస్తున్నామని అన్నారు. దీనివల్ల పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవకాశం కలుగుతుందని అన్నారు.

సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి అమలు చేస్తున్న కార్యక్రమాల వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని శ్రీ సింగ్ అన్నారు. ఈ కార్యక్రమాల ఫలితాలు దేశానికి ప్రయోజనం కలిగించాలన్న లక్ష్యంతో ఆత్మ నిర్భర్ భారత్ ను అమలు చేస్తున్నామని తెలిపారు. భారత పరిశ్రమలను దెబ్బ తీయాలన్న ఉద్దేశంతో కొన్ని దేశాలు అతి తక్కువ ధరలకు సౌర ఘటాలు, మాడ్యూళ్ళను అందుబాటులోకి తీసుకుని వస్తున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని భారత పరిశ్రమలను రక్షించాలన్న లక్ష్యంతో సౌర ఘటాలు, మాడ్యూళ్ళపై కస్టమ్స్ సుంకాన్ని విధించాలని నిర్ణయించామని మంత్రి వెల్లడించారు.

అనుమతి పొందిన నమూనాలు, ఉత్పత్తిదారుల జాబితా వల్ల కూడా స్వదేశీ పరిశ్రమలకు రక్షణ కలుగుతుందని శ్రీ సింగ్ పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమోనియా రంగాల్లో కూడా ప్రపంచంలో భారత్ అగ్ర స్థానంలో ఉంటుందని శ్రీ సింగ్ అన్నారు.

దిగుమతి చేసుకున్న సహజ వాయువు నుంచి ఉత్పత్తి గ్రే హైడ్రోజన్ స్థానంలో గ్రీన్ హైడ్రోజన్ ను వినియోగించాలని పరిశ్రమలకు సూచిస్తున్నామని శ్రీ సింగ్ తెలిపారు. దీనికోసం పెట్రోలియం, ఎరువుల లాంటి రంగాలు గ్రీన్ హైడ్రోజన్ కొనుగోలు ఒప్పందాలను కుదుర్చుకుంటాయని ఆయన వివరించారు. దీనివల్ల స్వదేశంలో ఉత్పత్తి అవుతున్న సౌర, పవన విధ్యుత్ ఉత్పత్తి పరికరాలకు డిమాండ్ పెరగడమే కాకుండా నిల్వ సామర్థ్యం కూడా పెరుగుతుందని అన్నారు.

తమ అవసరాలకు గ్రీన్ ఎనర్జీ ని వినియోగించడానికి ముందుకు వచ్చే పరిశ్రమలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం త్వరలో నియమ నిబంధనలకు రూపకల్పన చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ఇటువంటి పరిశ్రమలు స్వయంగా లేదా ఇతరుల సహకారంతో ఇంధన ఉత్పత్తి సౌకర్యాలను నెలకొల్పుకునే దానిద్వారా తమ ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి వీలుంటుందని శ్రీ సింగ్ అన్నారు. దీనిపై అనవసరమైన సర్‌చార్జ్,లెవీలు ఉండవని మంత్రి హామీ ఇచ్చారు.

అధిర్యపడొద్దు అండగా ఉంటా: ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

జోగులాంబ గద్వాల, జులై 16: : కాలువ కోతకు గురైందని రైతులు అధైర్య పడవద్దని అండగా ఉంటానని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. గూడెందొడ్డి రిజర్వాయర్ దగ్గర కాలువ కోతకు గురి కాగా ఎమ్మెల్యే పరిశీలించారు. ధరూర్ మండలం పరిధిలోని నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా గూడెందొడ్డి లిఫ్టు- 1 వద్ద నీటి ప్రవాహానికి గూడెందొడ్డి 99 ప్యాకేజీ రిజర్వాయర్ కాలువ తెగిపోయింది.

విషయం తెలుసుకున్నఎమ్మెల్యే వెంటనే సంఘటనస్థలానికి చేరుకుని కాలువను పరిశీలించారు. కాలువకు వస్తున్న ప్రెషర్ కారణంగా నీళ్లు ఉధృతంగా పారడంతో కాలువకు తెగింది. కాలువ మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. గేట్లను మూసేందుకు సాగునీటి శాఖ అధికారులు చర్యలు చేపటినట్లు తెలిపారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రఘురామ్ శర్మ ఎంపీపీ విజయ్, సర్పంచ్ రఘు వర్ధన్ రెడ్డి, టీఆర్ఎస్‌నాయకులు ప్రభాకర్ గౌడ్, భరత్, ఈశ్వర్, సాగు నీటి ఈఈ రహీముద్దీన్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో దూసుకెళ్తున్న నిర్మల్ : మంత్రి ఐకే రెడ్డి

నిర్మల్, జులై 16:: నిర్మల్ జిల్లా అయిన తరువాత అభివృద్ధిలో దూసుకెళ్తుందని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో రూ.7 కోట్ల 20 లక్షలతో నిర్మించనున్న సమీకృత మార్కెట్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..జిల్లాను అన్ని హంగులతో సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ క్రమంలో పూలు, కూరగాయలు, మాంసం, తదితర వస్తువులు అన్నీ ఒకే చోట దొరికేలా సమీకృత మార్కెట్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు.దీంతో వ్యాపారులకు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. త్వరలోనే ఇంటికి రూపాయికే నల్లా కనెక్షన్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ముషర్రఫ్ ఫారుఖీ, అదనపు కలెక్టర్ హేమంత్, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ బాలకృష్ణ, కాంట్రాక్టర్ మురళి, వైస్ చైర్మన్ షేక్ సాజిద్, డీఈ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కరోనా కష్టకాలంలో స్నేహాన్ని మరవని మిత్రులు

-కరోనా బాధితుడికి పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం.

రాజన్న సిరిసిల్ల, జులై 16: (నేటినిజం ప్రతినిధి): మహమ్మారి కరోనా కోరల్లో చిక్కుకుని కొట్టుమిట్టాడిన యువకుడు బ్లాక్ ఫంగస్ వల్ల కుడి కన్నును కోల్పోయిన చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నేవూరి రవి అనే పేద యువకుడికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం చేసి మానవత్వం చాటారు, రవి కూలీ పని చేసి జీవనం సాగించేవాడు,అతనికి బార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు గత మే నెలలో కరోనా సొకగా అతన్ని హైదరాబాదు లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు, కరోనా నుండి కోలుకుని ఇంటికి వచ్చాక మల్లీ బ్లాక్ ఫంగస్ సోకిందని దీంతో హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా డాక్టర్లు శస్త్రచికిత్స చేసి తన కుడి కన్నును తోలగించారు, ఆస్పత్రిలో చికిత్సకు ఎక్కువ మొత్తంలో ఖర్చులు కాగా అప్పులు చేయవలసిన దుస్థితి ఏర్పడింది, రవి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న తనతో పాటు పదవ తరగతి వరకు కలిసి చదువుకున్న చిన్ననాటి మిత్రులు జగన్ మోహన్ రూపాయలు 5000, అయిరేని శ్రీనివాసరావు 5000,బత్తుల కమలాకర్ 1000,కటుకూరి ముఖేష్ 1000, బండ శంకర్2000,రూపాయలు గూగుల్ పే ద్వారా సహాయం అందించారు,ఇంకా దాతలు ఉంటే సహాయం చేయాలని గ్రామస్తులు కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

పోలీస్‌స్టేషన్ల పరిపాలన అధికారులు సందేహాలను నివృత్తి చేసుకోవాలి

-అడిషనల్ డిసిపి(పరిపాలన) జి చంద్రమోహన్

కరీంనగర్ జులై 16(నేటినిజం ప్రతినిధి): సందేహాలను నివృత్తిచేసుకుని, పోలీసులు ప్రజలకు సేవలందించేందుకు ముందుకుసాగాలని కరీంనగర్ అడిషనల్ డిసిపి(పరిపాలన) జి చంద్రమోహన్ అన్నారు. సందేహాలను నివృత్తి చేసుకోవడం ద్వారా వివిధ సమస్యల పరిష్కారంపై అవగాహన పెంపొందుతుందని, పోలీస్‌స్టేషన్‌లలోని వివిధ విభాగాల పనితీరుపై పూర్తిస్థాయిలో పట్టుసాధించాలని చెప్పారు.

శుక్రవారంనాడు కమిషనరేట్‌కేంద్రంలో కమిషనరేట్‌వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న అడ్మిన్ (పరిపాలన) అధికారుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి(పరిపాలన) జి చంద్రమోహన్ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్లలో వివిధ విభాగాల పనితీరును ఎప్పటికప్పుడూ సమీక్షిస్తూ ఫిర్యాదులపై సత్వరం స్పందించి పరిష్కారమార్గాల నిర్ణయంలో పరిపాలన అధికారుల పాత్రకీలకమైందన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన అన్నివర్గాల ప్రజలను మర్యాదపూర్వకంగా పలుకరించి, వేగవంతంగా సేవలందించడంలో తీసుకునే చర్యల ద్వారా పోలీస్‌శాఖ ప్రతిష్ట పెంపొందుతుందని తెలిపారు. లభించేసమయాన్ని దేహదారుఢ్యం కాపాడుకోవడం, రోగనిరోధకశక్తిని పెంపొందించుకోవడం కోసం వివిధరకాల వ్యాయామాలను దినచర్యలో భాగంగా అలవర్చుకోవాలని సూచించారు. ప్రస్తుతం నెలకుని ఉన్న విపత్కర పరిస్థితులలో తగుజాగ్రత్తలు తీసుకుని విధినిర్వాహణ కొనసాగించడంతోపాటు ఇంటికి వెళ్ళిన తర్వాత వైద్యులు సూచనలు పాటించాలని కోరారు